

గ్రామాల్లోకెళ్లండి.. తాగునీటి పాట్లు తెలుస్తాయి

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య ఉంది. నాగాయలంక, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యటిస్తే తాగునీటి కోసం ప్రజలు ఎంతదూరం వెళుతున్నారో, వారి ఇబ్బందులు ఏమిటో తెలుస్తాయి. అవనిగడ్డ, పెడన, మచిలీపట్నం, పామర్రు తదితర నియోజకవర్గాల్లో తాగునీటి సమస్యను తీర్చేందుకు, ప్రతిరోజూ తాగునీటిని అందించేందుకు జల్‌జీవన్‌మిషన్ ద్వారా రూ.750 కోట్ల వ్యయం అంచనాలతో పనులకు రూపకల్పన చేస్తే టెండర్లు పిలిచారే కానీ పనులు మాత్రం చేయలేదు - బాలశౌరి, ఎంపీ



వైసీపీ మూక దాడి ఘటనలో దహనమవుతున్న కారు (ఫైల్)

2023 ఫిబ్రవరి 20వ తేదీన జరిగిందిదీ..

కృష్ణా జిల్లా గన్నవరంలో వైసీపీ రౌడీ మూక రెచ్చిపోయింది. టీడీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని ధ్వంసం చేసి, ఆ పార్టీ నాయకుల కార్లను దహనం చేసింది. ఈ మొత్తం విధ్వంసం అప్పటి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నేతృత్వంలో సాగినా పోలీసులు టీడీపీ వారిపైనే కేసులు పెట్టి వేధించారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగాక.. ఏడాదిన్నర తర్వాత గన్నవరం విధ్వంసం ఘటనలో 71 మందిని నిందితులుగా గుర్తించి ఎఫ్ఐఆర్ 137/2023 నమోదు చేశారు. తొలి విడతలో 15 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కానీ అరెస్టు చేసిన వారిలో ప్రభుకాంత్, బాపులపాడు మండల ఎంపీపీ నగేశ్ మినహా మిగిలిన వారంతా సామాన్య కార్యకర్తలే.

విధ్వంసరచన సూత్రధారులేరీ?

గన్నవరంలో విధ్వంసం సృష్టించిన కీలక పాత్రధారులైన అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఆయన ముఖ్య అనుచరులు.. ఓలుపల్లి మోహనరంగా రావు అలియాస్ రంగా, బి.యతేంద్ర రామకృష్ణ అలియాస్ రాము, కాట్రు శేషుకుమార్ అలియాస్ శేషు, గన్నవరం ఎంపీపీ అనగాని రవి, నక్కా గాంధీ, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, నన్నపనేని చలపతి, వంశీ పీఏ గద్దె సుధీర్ మాత్రం పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. వీరిలో కొంత మంది టీడీపీ పంచన చేరి కేసుల నుంచి రక్షణ పొందే ప్రయత్నం చేస్తున్నారు.

సూత్రధారులెక్కడ?

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడిలో 71 మందిపై ఎఫ్ఐఆర్

- ఘటన జరిగిన ఏడాదిన్నరకు కదిలిన పోలీసులు
- కేవలం 15 మంది సామాన్య కార్యకర్తలు అరెస్టు
- 71వ నిందితుడిగా సూత్రధారి వల్లభనేని వంశీ
- వంశీ ముఖ్య అనుచరులవైపు చూడని పోలీసులు
- అప్పట్లో రాడ్లు, కర్రలతో రెచ్చిపోయిన అనుచరగణం
- పోలీసులు, అప్పటి ఎమ్మెల్యే వంశీ సాక్షిగా అరాచకం
- కీలక నిందితులందరూ పరారీలో ఉన్నారట!

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/గన్నవరం) : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ బీసీ నాయకుడు దొంతు చిన్నకు వంశీ అనుచరుడు ఒకరు 2023 ఫిబ్రవరి 20వ తేదీ ఉదయం ఫోన్ చేసి బెదిరించారు. 'వంశీని విమర్శించే స్థాయి ఉందా నీకు..? నీ అంతు చూస్తాం' అని హెచ్చరించారు. ఆ తర్వాత కూడా పలువురు వంశీ అనుచరులమంటూ ఫోన్ చేసి బూతులు తిట్టారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే వంశీ అనుచరులు సుమారు 10 మంది మారణాయుధాలతో చిన్న ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో చిన్న ఇంటి వద్ద లేకపోవడంతో ఆయన భార్య రాణితో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వంశీపై మాట్లాడితే నీ భర్త అంతు చూస్తామంటూ బెదిరించారు. దీంతో ఆందోళనకు గురైన చిన్న భార్య రాణి మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు గన్నవరం పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. ఆమెతోపాటు టీడీపీ రాష్ట్ర నాయకుడు పట్టాభి పలువురు టీడీపీ నాయకులు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో వంశీ అనుచరులు ఓలుపల్లి మోహనరంగా అలియాస్ రంగా, భీమవరపు యేతేంద్ర రామకృష్ణ అలియాస్ రాము, ముల్పూరి ప్రభుకాంత్, రౌడీ షీటర్ యూసుబ్, కొల్లి చిట్టిబాబు, సగ్గుర్తి నాగదీప, కోటి తదితరులు టీడీపీ గన్నవరం నియోజకవర్గ కార్యాలయంపై రాడ్లు, కర్రలతో దాడికి తెగబడ్డారు. కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతోపాటు కార్యాలయ ఆవరణలో ఉన్న టీడీపీ నాయకుల కార్లను పెట్రోలు పోసి తగులబెట్టారు. సుమారు 5 కార్లపై పెట్రోలు పోసి తగులబెట్టగా ఎనికేపాడుకు చెందిన టీడీపీ నాయకుడు కోనేరు పెదబాబు కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. మరో నాలుగు కార్ల అద్దాలను పగులగొట్టారు. సుమారు గంటపాటు వంశీ అనుచరుల విధ్వంసం కొనసాగింది. వీరిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన టీడీపీ నాయకురాలు మండవ లక్ష్మీ ముక్కుపై కొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. మరో టీడీపీ నాయకుడు అంజిబాబు చాతిపై కర్రలతో దాడి చేశారు. బుస్సే సరిత, పొదిలి లలిత, మండవ రమ్యకృష్ణ కూడా వంశీ అనుచరుల దాడిలో గాయాలపాలయ్యారు. దాడి చేస్తున్నంత సేపూ జై వంశీ అంటూ నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగిపోయింది. టీడీపీ కార్యాలయంపై దాడి విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అయినా వంశీ అనుచరులను నిలువరించకుండా వారు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. మరోవైపు దాడి చేస్తున్న వంశీ అనుచరులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. అప్పటి సీఐ కనకరావు స్వయంగా సీనులో ఉండి టీడీపీ వాళ్లపై తన ప్రతాపం చూపారు.

● పక్కా ప్రణాళికతోనే..

టీడీపీ బీసీ నాయకుడిపై దాడితోపాటు పార్టీ కార్యాలయంపై దాడికి అప్పటి ఎమ్మెల్యే వంశీ అనుచరులు పక్కా వ్యూహరచన చేశారు. నియోజకవర్గ పరిధిలోని వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు ఘటన జరిగిన రోజు ఉదయమే గన్నవరం వంశీ కార్యాలయం నుంచి మెస్సేజ్‌లు వెళ్లాయి. మధ్యాహ్నం 3 గంటలకు వంశీ కార్యాలయానికి తప్పకుండా రావాల్సిందిగా ఆ మెస్సేజ్‌లో కోరారు. దీంతో నియోజకవర్గంలోని 100 మందికిపైగా నాయకులు, కార్యకర్తలు మధ్యాహ్నం 3 గంటలకు వంశీ కార్యాలయానికి చేరుకున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో విధ్వంసం ప్రారంభమైంది. సుమారు 3 గంటలపాటు వైసీపీ మూక రెచ్చిపోయింది.

టీడీపీ నాయకులపై హత్యాయత్నం కేసు

అప్పటి గన్నవరం సీఐ కనకారావు తనపై టీడీపీ నాయకులు హత్యాయత్నం చేశారని, కులం పేరుతో దూషించారని ఇచ్చిన ఫిర్యాదుతో టీడీపీ నాయకుడు పట్టాభితోపాటు మరికొందరు నాయకులపై కేసులు నమోదు చేశారు. సీఐ ఫిర్యాదు ఆధారంగా అప్పటి డీఎస్పీ విజయపాల్ విచారణ జరపడం.. నిందితులెవరో తేల్చేసి అరెస్టు చేయడం అంతా ఆగమేఘాలపై జరిగిపోయింది. అదే ఉత్సాహాన్ని పోలీసులు ఇప్పుడు ప్రదర్శించడం లేదు. పోలీసుల నుంచి కేసు నమోదుపై వంశీ, ఆయన అనుచరులకు ముందస్తుగానే సమాచారం లీకైనట్టు చెబుతున్నారు. దీంతో వంశీతోపాటు ఆయన అనుచరులు అందరూ అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై టీడీపీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

పనులు చేస్తామన్నా సహకరించరే..

- ఈ విధానం భారతదేశంలో ఎక్కడా ఉండదు
- కేంద్రం నిధులతో పనులు చేసేందుకు ముందుకొచ్చినా కార్పొరేషన్ అధికారులు సహకరించడం లేదు
- బందరుపోర్టు రోడ్‌కం రైలు మార్గానికి భారత్‌మాల ద్వారా కేంద్రం నుంచి నిధులు తెస్తా
- జల్‌జీవన్‌మిషన్ ద్వారా పనులు చేయకుంటే ఎలా?
- జిల్లా అభివృద్ధి సమీక్షామండలి సమావేశంలో అధికారులపై ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆగ్రహం

మచిలీపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : 'మచిలీపట్నం కార్పొరేషన్ పాలకవర్గం, అధికారులు తీరు బాగోలేదు. కేంద్ర ప్రభుత్వ నిధులతో మచిలీపట్నం కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల కోసం నిధులు విడుదల చేసేందుకు ముందుకొచ్చినా అధికారులు సహకరించరు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇంత నిర్లక్ష్యం దేశంలో నేను ఎక్కడా చూడలేదు' అని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, వివిధ శాఖల జిల్లా అధికారులతో గురువారం నిర్వహించారు. మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల పనితీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. (మిగతా 6లో)

రోడ్ కం రైలు మార్గానికి కేంద్రం నిధులు తెస్తా

జిల్లా సమీక్షామండలి సమావేశంలో తొలుత బందరుపోర్టు పనుల పురోగతిపై ఎంపీ బాలశౌరి సమీక్ష నిర్వహించారు. పోర్టు అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పనులు జరుగుతున్న తీరును వివరించారు. రూ.6,668 కోట్ల అంచనాలతో తొలివిడతగా 1734 ఎకరాల్లో బందరుపోర్టు పనులను ప్రారంభించామని తెలిపారు. ఇప్పటివకు 19.06 శాతం పనులు పూర్తయినట్టు చెప్పారు. 2025 అక్టోబరు నాటికి 90 శాతం పనులను పూర్తిచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. జాతీయ రహదారి 216-ఏ నుంచి పోర్టు వరకు 3.9 కిలోమీటర్ల మేర రోడ్‌కం రైలుమార్గం నిర్మాణ పనులను ప్రారంభించాల్సి ఉందన్నారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ బందరుపోర్టు కనెక్టివిటీ కోసం రోడ్‌కం రైలుమార్గానికి అవసరమైన నిధులను భారత్‌మాల పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయించేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. బందరుపోర్టు నిర్మాణం జరిగితే వ్యాపారం ఎంతమేర సాగుతుంది? ఏడాదికి ఎంతమేర ఆదాయం సమకూరు తుంది? పోర్టు పనులు ఎప్పటిలోగా పూర్తిచేస్తారు? తదితర అంశాలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పోర్టు వరకు రోడ్‌కం రైలు మార్గాల నిర్మాణం కోసం భూసేకరణలో ఉన్న అడ్డంకులన్నింటిని సరిదిద్దామని, అభివృద్ధి పనులకు సహకారం అందిస్తామని అన్నారు.

బ్రహ్మాండంగా.. బ్రహ్మయ్యలింగం చెరువు



- సీఎం చంద్రబాబు నాటి ఆకాంక్ష.. నేడు ఫలించే దిశగా..
- చెరువు, ఆలయాన్ని పరిశీలించిన ఏపీటీడీసీ అధికారులు
- బోటింగ్ , కాటేజీల ఏర్పాటుకు స్థల పరిశీలన
- ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా కేంద్ర నిధులతో అభివృద్ధి

6లో..

బెల్టుషాపులకు మద్యం తరలింపు

- కోడూరులో ప్రభుత్వ దుకాణం నుంచి మద్యం తరలింపు
- పట్టించుకోని ఎక్సైజ్‌శాఖ అధికారులు
- మచిలీపట్నంలో కాపుసారా కాసేవారిని వదిలేసి తాగినవారిపై కేసు నమోదు




ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించాల్సిన మద్యం బెల్టు షాపులకు తరలిపోతోంది. ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసే సిబ్బంది కమీషన్ల కోసం కక్కుర్తిపడి మూటలకొద్దీ మద్యాన్ని బెల్టుషాపు నిర్వాహకులకు విక్రయించేస్తున్నారు. బుధవారం రాత్రి కోడూరులోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి రెండు మూటల్లో మద్యం సీసాలను తరలించుకుపోతున్న దృశ్యాలను స్థానికులు వీడియో తీసి పోలీసులకు చూపారు. ఇది ఎక్సైజ్ అధికారులు చూడాల్సిన వ్యవహారమని, ఈ అంశంపై తమకెలాంటి ఫిర్యాదూ అందలేదని కోడూరు పోలీసులు చెప్పడం గమనించదగ్గ అంశం.


కోడూరులో బెల్టుషాపు వద్ద రెండు మూటల్లో మద్యం సీసాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వైసీపీకి చెందిన ఓ వ్యక్తి కోడూరు చుట్టు పక్కల గ్రామాల్లో కొంతకాలం నుంచి 25 బెల్టుషాపులకుపైగా నిర్వహిస్తున్నాడు. కూటమి అధికారంలోకి రావడంతో అక్కడి అధికార పార్టీ నాయకుడు ఒకరిని కలుపుకుని బెల్టుషాపులకు ఇబ్బందిలేకుండా ఇటీవల రాయబారం నడిపినట్టు కూటమి నాయకులే చెబుతున్నారు. బుధవారం రాత్రి కోడూరులోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి రెండు గోనెసంచుల్లో మద్యం సీసాలను తీసుకువచ్చి ఇద్దరు వ్యక్తులు తీసుకువెళుతున్న దృశ్యాలను వీడియోతీసి సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో ఈ విషయం బయటకు వచ్చింది. ప్రభుత్వ దుకాణం నుంచి తీసుకువెళ్లిన మద్యాన్ని క్వార్టర్ బాటిల్‌కు అసలు ధరకన్నా రూ.50 పెంచి విక్రయాలు జరుపుతుండటం గమనార్హం. ప్రభుత్వ మద్యం షాపులు ఉదయంపూట తెరవకముందు, రాత్రి సమయంలో మూసివేసిన తరువాత మందుబాబులు మద్యం కోసం ఎగబడుతుంటంతో బెల్ట్‌షాపుల వద్ద మద్యం కోసం రద్దీ పెరుగుతోంది. దీంతో బెల్టుషాపుల వద్ద వీరి అక్రమవ్యాపారం జోరుగా సాగుతోంది. కోడూరుతో పాటు జిల్లాలోని ఇతర ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి కూడా బెల్ట్‌షాప్ నిర్వాహకులకు మద్యం విక్రయించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతిరోజూ కేసులకొద్దీ మద్యాన్ని షాపుల్లో పనిచేసే సిబ్బంది బెల్టుషాపు యాజమానులకు విక్రయించేస్తున్నారు. ఇందుకుగాను బాటిల్‌కు ఐదు నుంచి పది రూపాయలు కమీషన్‌గా తీసుకుంటున్నారు. ఈ నగదులో అధికారులకు కొంత పంపుతుండటంతో ఏం జరిగినా ఎక్సైజ్ అధికారులు మిన్నకుండిపోతున్నారు. కోడూరులో జరిగిన విషయం బయటకు రావడంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

మచిలీపట్నం ఎక్సైజ్ అధికారుల తీరే వేరు

మచిలీపట్నం ఎక్సైజ్ అధికారుల తీరుతో ప్రజలు విస్తుపోతున్నారు. పదిరోజుల క్రితం బందరు మండలంలోని కరగ్రహారం గ్రామానికి ఎక్సైజ్ అధికారులు సోదాల నిమిత్తం వెళ్లారు. కాపుసారా తయారుచేసే వ్యక్తి రెండు చిన్న కూల్‌డ్రింక్ బాటిళ్లలో కాపుసారాను ఒక్కో బాటిల్‌ను వంద రూపాయల చొప్పున ఇద్దరు మత్స్యకారులకు అమ్మారు. కాపుసారాను విక్రయించిన వ్యక్తిని వదిలేసి కాపుసారా తాగుతున్న వారిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. కాపుసారా కాస్తూ, స్థానికంగా విక్రయిస్తున్న వ్యక్తి ఎవరో తెలిసినా అతన్ని వదిలేయడమేంటని గ్రామస్తులు ఎక్సైజ్ పోలీసులను నిలదీశారు. ఎక్సైజ్‌పోలీసులు తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.


శుభ్రం చేయకముందు..


శుభ్రం చేశాక

- కోళ్ల, రొయ్యలు, చేపల వ్యర్థాలతో ఐదేళ్లుగా తాగు, సాగునీటి కాలువ దుర్గంధభరితం
- ఎమ్మెల్యే ఆదేశాలతో శుభ్రం చేయించిన అధికారులు

పై చిత్రాల్లో కనిపించేది... నాలుగు మండలాలు, 50 గ్రామాలకు తాగు, సాగునీరు అందించే గుడివాడ-మదినేపల్లి ప్రధాన రహదారిలోని కాలువ. గుడివాడలోని చికెన్ దుకాణాలు, చేపలు, రొయ్యల దుకాణాల నుంచి వెలువడే మిగులు వ్యర్థాలన్నీ ఐదేళ్లుగా ఈ కాలువలోనే వేయడంతో కుళ్లి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోంది. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని పట్టించుకోలేదు. జనం ఫిర్యాదు చేసినా అధికారులు కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి ఈ సమస్య వెళ్లడంతో వెంటనే స్పందించారు. తక్షణమే కాలువ శుభ్రం చేయించాలని అధికారులను రెండ్రోజుల క్రితం ఆదేశించడంతో ఆగమేఘాలపై సిబ్బంది కార్యాచరణకు పూనుకున్నారు. గురువారం ఇరిగేషన్ డీఈ పి.సూర్యభరత్ ఆధ్వర్యంలో అధికారులు ఎక్స్‌కవేటర్‌తో వంతెన కింద, పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించారు. తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చేశారు. - గుడివాడ

పచ్చని పల్లెకు ఏదో శాపం తగిలింది. కళకళలాడే గ్రామం ఐదు రోజులుగా విలవిల్లాడిపోతోంది. పొట్టకూటి కోసం కూలి పనికి వెళ్లిన గ్రామస్థులు జీవచ్ఛవాల్లా ఆసుపత్రుల్లోని మంచాలపై పడి ఉండటం చూసి కుటుంబాలకు కుటుంబాలు కన్నీరు పెడుతున్నాయి. ఇప్పటికే మృతిచెందిన వారి బంధువుల రోదనలతో కుమిలిపోయిన ఆ గ్రామం.. చికిత్స పొందుతున్న క్షతగాత్రులు ఎప్పుడు క్షేమంగా వస్తారా అని ఆశగా ఎదురుచూస్తోంది. అల్ట్రాటెక్ కర్మాగారం నిర్లక్ష్యం.. అధికారుల లెక్కలేనితనం.. కాంట్రాక్టర్ విచ్చలవిడితనం.. వెరసి బూదవాడ గ్రామం ఇంకా బోరున విలపిస్తూనే ఉంది.


బూదవాడ గ్రామం

పచ్చని పల్లెపై విషం..!

- ఇంకా కన్నీటి సుడిలోనే బూదవాడ గ్రామం
- అల్ట్రాటెక్ కర్మాగారం ఘటనతో కకావికలం
- ఇప్పటికే ఇద్దరు మృతి.. నలుగురి పరిస్థితి విషమం
- క్షతగాత్రుల క్షేమ సమాచారం కోసం ఎదురుచూపులు
- అందరూ పొట్టకూటి కోసం రోజుకూలీకి వెళ్లినవారే..
- వెట్టిచాకిరీ చేసినా అరకొర కూలీనే..
- కంపెనీ నిర్లక్ష్యం.. అధికారుల లెక్కలేనితనం
- యూపీ, బిహార్, జార్ఖండ్ కూలీలే అధికం

జగ్గయ్యపేట రూరల్ : బూదవాడ గ్రామానికి అమాయక గ్రామమని పేరు. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు ఎవరైనా మాట్లాడితే, 'మాకు కాదు.. బూదవాడ వాసులకు చెప్పు' అనే సామెత సైతం గతంలో వాడుకలో ఉండేది. దీన్నిబట్టి ఇక్కడి గ్రామస్థులు ఎంత అమాయకులో అర్థమవుతుంది. చుట్టూ పచ్చటి అడవితో పాడి సంపదకు నిలయంగా కళకళలాడుతూ ఉండేది ఈ గ్రామం. కేవలం 5 వేల మంది జనాభాతో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలు అధికంగా ఉన్నా, రెండు తెలుగు రాష్ట్రాలకు సరిహద్దు గ్రామమైనా ఎక్కడా తెలంగాణ వాసన కనిపించదు. అచ్చమైన ఆంధ్రులుగా వీరు దశాబ్దాలుగా ఈ చిన్న ఊరులోనే జీవనం సాగిస్తున్నారు.


అల్ట్రాటెక్ రాకతో..

కాలక్రమంలో టెక్నాలజీ పెరగటం, విద్య అందుబాటులోకి రావటం, గ్రామంలో కర్మాగారం ఏర్పాటవటంతో ఇక్కడి స్వరూపమంతా మారిపోయింది. అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగార యాజమాన్య నిర్లక్ష్యం గ్రామస్థులకు శాపంగా మారింది. స్థానికులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించాల్సి ఉన్నా, కంపెనీతో అంటకాగుతున్న దళారులకు కాంట్రాక్టు అప్పగించారు. స్థానికులకు కూలి పనులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన అప్పజెప్పి వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. మొత్తం మూడు షిఫ్టుల్లో ఒక్కో షిఫ్టుకు సుమారు 500 మందికి వరకూ ఇక్కడ పనిచేస్తున్నారు. ఎంత గొడ్డు చాకిరీ చేసినా వీరికి రోజుకు ఇచ్చేది రూ.400 నుంచి రూ.500లే. పట్టణాల్లో కూలీకి వెళ్లి రావడం కష్టంతో కూడుకున్న పని. ఇంటి పక్కనే ఉన్న కర్మాగారంలో కూలి దొరికితే చాలనుకున్న చాలామంది అమాయకులు శాశ్వత ఉద్యోగాల ప్రస్తావనే లేకుండా పనులకు వెళ్లేవారు. ఇక వీరికి పోటీగా జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్‌కు చెందిన వలస కార్మికులు కుప్పలు తెప్పలుగా దిగుమతి అయ్యేవారు. ఆయా శాఖల అధికారులను చెప్పుచేతల్లోకి తీసుకున్న కర్మాగారాన్ని ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. ఫలితంగా గ్రామంలో చాలామంది ఇతర రాష్ట్రాల వారు వేళ్లానుకున్నారు. కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నా గ్రామానికి చేసింది మాత్రం శూన్యం. ఈ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో నిర్మించిన ఆసుపత్రిలోకి గానీ, ఆలయంలోకి గానీ స్థానికులను అనుమతించరంటేనే ఇక్కడ ఎంతటి పక్షపాత వైఖరి కొనసాగుతుందో తెలుస్తుంది. (మిగతా 6లో)

అయ్యో కొడుకా..

గుగులోతు గోపీ సంపాదనే కుటుంబానికి ఆధారం. భార్య రోజా, కుమారుడు కల్యాణ్, కుమార్తె మల్లిక, తల్లిదండ్రులు కూడా గోపీపైనే ఆధారపడి ఉన్నారు. ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపీ పరిస్థితి ఇప్పుడు విషమంగానే ఉంది. తన కుమారుడికి ఏమైనా జరిగితే కుటుంబం పరిస్థితి ఏమిటని ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపిస్తున్నారు.

● ఆధారమే లేకపోయె..



ఈయన పేరు వేముల సైదులు. భార్య అన్నపూర్ణ, కుమారుడు నారాయణరావు, కుమార్తె శైలజ. కుమార్తెకు ఇటీవల వివాహమైంది. గతంలో సమీప పట్టణంలో పనులకు వెళ్లేవాడు. నెలకు రూ.20 వేలు కూడా వచ్చేవి కావు. పనులు లేక ఫ్యాక్టరీలో రోజు కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత ఆదివారం జరిగిన ప్రమాదంలో 60 శాతం కాలిన గాయాలతో విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబానికి ఆధారమైన సైదులు ఆసుపత్రిలో ఉండగా, ఆ కుటుంబమంతా కన్నీటితో ఎదురుచూస్తోంది.



తిరుపతమ్మ ఆలయంలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుపతమ్మకు ఆషాఢం సారె

పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న తిరుపతమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన మహిళలు ఆషాఢం సారెను అత్యంత భక్తిశ్రద్ధలతో గురువారం సమర్పించారు. గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన మహిళలు మేళతాళాలు మంగళ వాయిద్యాలతో అమ్మవారి దేవస్థానం వరకు ఊరేగింపుగా చేరుకున్నారు. మహిళా భక్తులకు దేవస్థానం వద్ద ఆలయ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు, చైర్మన్ జంగాల వాసు, ధర్మకర్తలు, వేదపండితులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మాండంగా.. బ్రహ్మయ్యలింగం చెరువు

- సీఎం చంద్రబాబు నాటి ఆకాంక్ష.. నేడు ఫలించే దిశగా..
- చెరువు, ఆలయాన్ని పరిశీలించిన ఏపీటీడీసీ అధికారులు
- బోటింగ్, కాటేజీల ఏర్పాటుకు స్థల పరిశీలన
- ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా కేంద్ర నిధులతో అభివృద్ధి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బ్రహ్మయ్యలింగం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) విజయవాడ డివిజన్ అధికారుల బృందం గురువారం బ్రహ్మయ్యలింగం చెరువు ప్రాంతాన్ని పరిశీలించింది. ఏపీటీడీసీ విజయవాడ డీవీఎం చైతన్య, బెర్మ్‌పార్క్ మేనేజర్ శ్రీనివాస్, అడ్మిన్ మేనేజర్ శ్రీధర్‌తో కూడిన బృందానికి బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త అన్నే లక్ష్మణరావు (నల్లబాబు) ఇక్కడి విశేషాల గురించి వివరించారు. 1260 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఉన్న చెరువుతో పాటు చారిత్రక ప్రాశస్త్యం కలిగిన బ్రహ్మయ్యలింగేశ్వర స్వామి ఆలయాన్ని, చుట్టూ వృత్తాకారంలో ఉన్న కొండలు, ప్రకృతి రమణీయ దృశ్యాలను ఏపీటీడీసీ అధికారుల బృందం వీక్షించింది. బోటింగ్‌కు సంబంధించి ప్లాట్‌ఫాం నిర్మించటానికి వీలుగా ఉన్న ప్రాంతంతో పాటు బోటింగ్ యూనిట్ బుకింగ్ ఆఫీసు, బ్రహ్మయ్యలింగం చెరువు వ్యూ పాయింట్ లొకేషన్లను పరిశీలించింది. పర్యాటకులు విడిది చేసేందుకు వీలుగా కాటేజీల ఏర్పాటుకు సంబంధించి అనువైన భూములను చూశారు. అనంతరం బ్రహ్మయ్యలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. కేంద్ర పర్యాటకశాఖ నేతృత్వంలో పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిట్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీమ్‌లో భాగంగా అటు ఆలయాన్ని, ఇటు చెరువును ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయవచ్చని నిర్ణయించారు. అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి త్వరలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)కు నివేదిక పంపనున్నారు. ఈడీ సందర్శన తర్వాత పర్యాటక శాఖ మంత్రితో చర్చలు జరుపుతారు. స్థానిక శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావుకు కూడా ఈ విషయాన్ని తెలియపరిచి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లనున్నారు.

గతంలోనే శ్రీకారం

బ్రహ్మయ్యలింగం చెరువును గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పర్యాటకంగా, రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఇక్కడికి వచ్చి రూ.180 కోట్ల అంచనాతో ఎత్తిపోతల ప్రాజెక్టును మంజూరు చేశారు. పనులు దాదాపు పూర్తయ్యాయి. మరో రూ.3 కోట్లు ఖర్చుపెడితే పోలవరం కుడికాల్వ నీటిని బ్రహ్మయ్యలింగం చెరువులో నిల్వచేసే అవకాశం ఏర్పడేది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావటంతో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు మార్గం ఏర్పడింది.

పచ్చటి పల్లెపై విషం..!

(5వ పేజీ తరువాయి)

బాణావతు సైదా కుటుంబం కడు పేదరికంలో ఉంది. భార్య వీరేశ్వరి, కుమారుడు సత్యారాం, కుమార్తె తేజస్వితో పాటు నాయనమ్మ చిట్టి, తల్లి మంగమ్మ, చెల్లి నాగబాల, మేనకోడలు దుర్గ బాధ్యత కూడా సైదాపైనే ఉంది. వీరందరికీ అతని సంపాదనే ఆధారం. ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన సైదా విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, క్షేమంగా రావాలని ఆ కుటుంబమంతా కోరుకుంటోంది.

పోలీస్ కావాలని.. కూలి పనికి..

దారావతు వెంకటేశ్వరరావు.. పోలీస్ ఉద్యోగం కోసం ఎన్నో కలలు కన్నాడు. పలుమార్లు కానిస్టేబుల్, ఎస్‌ఐ సెలక్షన్లకు కూడా వెళ్లాడు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూనే ఖాళీగా ఉండటమెందుకని ఫ్యాక్టరీలో కూలీగా మారాడు. కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో చిమ్మిన పౌడర్ వెంకటేశ్వరరావు కళ్లలో పడింది. భార్య నాగమణి, కుమారుడు నరేంద్ర, కుమార్తె కీర్తి ఉన్నారు. పిల్లలిద్దరూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. తన కుమారుడి కళ్లకు ఏమైనా జరిగితే పరిస్థితి ఏమిటా..? అని వెంకటేశ్వరరావు తల్లిదండ్రులు నంద, లక్ష్మీ విలపిస్తున్నారు.

ఎప్పుడు ఏమవుతుందో..

పరిటాల అర్జున్ పరిస్థితి విషమంగా ఉంది. తండ్రి వెంకటేశ్వర్లు సర్పంచ్‌గా పనిచేశారు. భార్య నాగలక్ష్మి, కుమారులు గురుసాయి, పవన్‌తేజ ఉన్నారు. ప్రస్తుతం అర్జున్ పరిస్థితి విషమంగా ఉందని, ఎప్పుడు ఏ దుర్వార్త వినాల్సి వస్తోందని ఆ కుటుంబం కన్నీటితో రోజులు గడుపుతోంది. పరిహారం ఇచ్చినా.. ఆ కుటుంబ భవిష్యత్తు ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇంకా విషమంగానే..

అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో గత ఆదివారం జరిగిన ప్రమాదంలో 16 మందికి గాయాలయ్యాయి. వీరిలో 80 నుంచి నూరుశాతం కాలిపోయిన ఆవుల వెంకటేశ్, బాణావతు స్వామి ఇప్పటికే మృతిచెందగా, బొంత శివనారాయణ, పరిటాల అర్జున్ వెంటిలేటర్‌పై ఉన్నారు. గుగులోతు గోపీనాయక్, బాణావత్ సైదా పరిస్థితి కూడా విషమంగానే ఉంది. వారిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. 5 నుంచి 30 శాతం మేర కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న వారు ముగ్గురు ఉండగా, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్‌కు చెందిన ఏడుగురు విజయవాడలోని ఆంధ్ర, మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సైదాకు కాలిన గాయాలు లేకపోయినా, బూడిద గొంతులోకి వెళ్లింది. దారావతు వెంకటేశ్వరరావుకు కళ్లలో పడింది. దీంతో వీరిద్దరికీ వైద్యం అందిస్తున్నారు. వీరితో పాటు 5 నుంచి 30 శాతం మేర కాలిన గాయాలైన జార్ఖండ్‌కు చెందిన అరుణ్ నిషాశర్మ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన దినేష్‌కుమార్, నాగేంద్ర, అరవింద్ యాదవ్, గుడ్డు కుమార్, శుభం సోనీ, బిహార్‌కు చెందిన బిబిల్ సింగ్ చికిత్స పొందుతున్నారు.

పనులు చేస్తామన్నా..!

(5వ పేజీ తరువాయి)

కేంద్ర బృందం మచిలీపట్నం పర్యటనకు వచ్చి ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలో అధ్యయనం చేసేందుకు వస్తామని చెప్పినా ఎందుకు పట్టించుకోవడంలేదో తనకు అర్థం కావడం లేదన్నారు. మచిలీపట్నంలో డ్రెయినేజీలను నిర్మించి శివారు ప్రాంతాల్లో నీరు బయటకు పోకుండా డ్రెయినేజీలను కుదిస్తే ఎలాగని ఎంపీ బాలశౌరితో పాటు కలెక్టర్ బాలాజీ కూడా మునిసిపల్ కార్పొరేషన్ అధికారులను నిలదీశారు.

జల్‌జీవన్ మిషన్ పనులు ఎందుకు నిలిపివేశారు?

తాగునీటిని నిల్వ ఉంచేందుకు చెరువుల తవ్వకం పనులను చేయలేదని, జల్‌జీవన్ మిషన్ ద్వారా ఏడాదిన్నర క్రితమే నిధులు విడుదలైతే ఎందుకు ఈ పనులు చేయలేదని ఎంపీ ప్రశ్నించారు. పథకం ద్వారా నాలుగైదు లక్షలకు మించని పైప్‌లైన్ ఏర్పాటు వంటి పనులను కొంతమేర చేసి సరిపెట్టారని, శాశ్వతకాలం పనికివచ్చే పనులను మాత్రం చేయలేదని అన్నారు. పనులు చేయకపోవడంతో నిధులు వెనుదిరిగిపోతే బాధ్యత ఎవరు వహిస్తారని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను నిలదీశారు. తాగునీటి చెరువుల తవ్వకాలకు భూసేకరణలో అడ్డంకులున్నాయని, ఇతరత్రా కారణాలు చూపి పనులు చేయకుండా జాప్యం చేస్తున్నారని, ఈలోగా ప్రజలు తాగునీటి కోసం పడే ఇబ్బందులను ఎలా పరిష్కరించాలని, వారికి ఏం సమాధానం చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిధులను ఈ పనులకు కేటాయించాల్సి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయకపోవడంతో పనులు సకాలంలో కాంట్రాక్టర్లు ప్రారంభించలేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు.

ప్రకాశం బ్యారేజీ దిగువన వంతెనల సంగతేంటి?

ప్రకాశం బ్యారేజీ దిగువన చోడవరం, మోపిదేవి సమీపంలో కృష్ణానదిలో వరదనీటిని ఒడిసి పట్టేందుకు నిర్మాణంచేసే రెండు వంతెనల నిర్మాణ పనులకు సంబంధించిన అనుమతుల్లో ఎంతమేర కదలిక ఉందని ఎంపీ బాలశౌరి అధికారులను వివరాలు కోరారు. నీటిపారుదలశాఖ ఎస్ఈ, ఈఈలు అమరావతిలోని సచివాలయంలో జరిగే సమావేశానికి వెళ్లారని, ఈ రెండు వంతెనలకు సంబంధించి పూర్తిస్థాయి అనుమతులు రాలేదని అధికారులు తెలిపారు.

ధరల స్థిరీకరణకు చర్యలు

- రైతు బజార్లలో బియ్యం, కందిపప్పు కౌంటర్లు
- ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 11 : రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడంతో పాటు ధరల స్థిరీకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గనులు, భూగర్భజల, ఎక్సైజ్ శాఖ



కందిపప్పు పంపిణీ చేస్తున్న మంత్రి రవీంద్ర

మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నం రైతుబజారులో రైసుమిల్లర్స్ అసోసియేషన్, బృందావన వర్తక సంఘాల సహకారంతో ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం ప్రత్యేక కౌంటర్లను మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని రైతుబజార్ల ద్వారా నాణ్యమైన కందిపప్పు, స్టీమ్‌డ్ బియ్యాన్ని తక్కువ ధరకు అందిస్తున్నామన్నారు. రైతులు పండించిన కూరగాయలను నేరుగా విక్రయించేందుకు సీఎం చంద్రబాబు రైతుబజార్లను ఏర్పాటు చేశారన్నారు. దీనివల్ల వినియోగదారులకు నాణ్యత గల కూరలు లభిస్తున్నాయన్నారు. ఆగస్టు నుంచి రేషన్‌షాపుల్లో పంచదార సరఫరా చేస్తామన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా ఇసుకను దోచేశారు..

గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు ఇసుకను ఇష్టారాజ్యంగా దోచేశారని మంత్రి రవీంద్ర అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఇసుక విధానం అమలులోకి వచ్చిందని, దీని వల్ల ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. కృష్ణాజిల్లాలో వినియోగదారులకు ఇసుకను సరఫరా చేసేందుకు రీచ్‌లు లేకపోవడంతో ప్రజల నుంచి పలు వినతిపత్రాలు అందుతున్నాయన్నారు. వర్షాకాలం మూడు నెలల వరకు ఇసుక ఇబ్బందులు ఉంటాయని, తరువాత అన్ని రీచ్‌ల్లో ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబాప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్, ఆర్డీవో ఎం.వాణి, డీఎస్‌వో పార్వతి, నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ శాఖాధికారులు పాల్గొన్నారు.



రైతు బజారులో తనిఖీ చేస్తున్న జేసీ

ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు : జేసీ

వినియోగదారులకు రైతుబజారులో నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు తప్పవని జేసీ గీతాంజలి శర్మ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్సిడీపై బియ్యం రూ. 49, కందిపప్పు రూ. 160కు అందిస్తున్నామన్నారు. గురువారం రైతుబజారులోని షాపులను జేసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను వివరించారు. షాపుల నిర్వహణకు రేకుల షెడ్లు వేయాలని కోరారు.

పరిహారం ఇప్పించండి సారూ..

- ఎంపీ బాలశౌరికి మల్లవల్లి రైతుల వినతి

మచిలీపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గం మల్లవల్లి పారిశ్రామికవాడకు భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ జనసేన నాయకులు, రైతులు గురువారం ఎంపీ వల్లభనేని బాలశౌరి, కలెక్టర్ డీకే బాలాజీకి గురువారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. రెండురోజులుగా ఆర్ఎస్‌నెంబరు 11లోని భూముల్లో సరిహద్దుల ఏర్పాటుపేరుతో ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు కొలతలు కొలుస్తున్నారని వివరించారు. రైతులకు పరిహారం ఇవ్వకుండా భూమిలో కొలతలు ఎలా కొలుస్తారని ప్రశ్నిస్తే గతంలోనే నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని, బకాయిలు ఏమీ లేవని అధికారులు చెబుతున్నారని తెలిపారు. ఇటీవల ఈ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లామని రైతులకు పరిహారం ఇచ్చేవరకు సరిహద్దులు నిర్ణయించే ప్రక్రియను నిలిపివేయాలని వారు కోరారు. ఈ అంశంపై పూర్తిస్థాయి వివరాలు సేకరించిన తరువాతనే తగు నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా రైతులకు హామీ ఇచ్చారు.

త్వరితగతిన పరిష్కరించాలి : జనసేన



మల్లవల్లి రైతుల సమస్యపై బందరు ఎంపీ బాలశౌరితో మాట్లాడుతున్న జనసేన నేత శివరామకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పారిశ్రామికవాడ అభివృద్ధికి సాగుభూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలని బందరు పార్లమెంటు ఎంపీ బాలశౌరికి జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ వినతిపత్రం అందజేశారు. బందరులో గురువారం ఎంపీ బాలశౌరిని కలిసి వినతిపత్రం అందజేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడి సంఘీభావం తెలిపారని గుర్తుచేశారు. పారిశ్రామికవాడ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, సాగు భూములు తీసుకుని నష్టపరిహారం ఇవ్వకపోవడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచన మేరకు త్వరలోనే రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ బాలాజీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి

- జాతీయ రహదారుల పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- డయేరియా నియంత్రణకు చర్యలు
- తండాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



అధికారుల సమీక్షా సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ సృజన తదితరులు

కృష్ణలంక, జూలై 11 : అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి భాగస్వామ్యంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని, సరైన ప్రణాళికలు నిధుల సక్రమ వినియోగంతో మంచి ఫలితాలు వస్తాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం కేశినేని శివనాథ్ జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కలెక్టర్ జి.సృజన, జాతీయ రహదారులు, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, జీజీహెచ్ కార్యకలాపాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ఏఐకు సంబంధించి పెండింగ్ ప్రాజెక్టులు, డీపీఆర్, సర్వీసు రహదారుల విస్తరణ పనుల పూర్తికి ఎదురవుతున్న సమస్యలు తదితరాలపై చర్చించారు. అదేవిధంగా జిల్లాలో డయేరియాకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకున్న చర్యలు, ఎ.కొండూరు డయాలసిస్ కేంద్రం సేవలు, జలజీవన్ మిషన్ పనులు, పైపులైన్ల మరమ్మతులు, ఓహెచ్ఎస్ఆర్‌ల స్థితిగతులు తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, విజయవాడ బైపాస్ పనుల సత్వర పూర్తికి అవరోధంగా వున్న హైటెన్షన్ లైన్ల పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, పరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వీలుగా ఎన్‌హెచ్-16లో మహానాడు రోడ్డు నుంచి నిడమానూరు వరకు మెగా ఫ్లై ఓవర్‌కు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనపై దృష్టిసారించాలన్నారు. ఎ.కొండూరు ప్రాంత ప్రజలకు కిడ్నీ సమస్యల నుంచి శాశ్వత పరిష్కారం దిశగా తాగునీటి వ్యవస్థల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ కేంద్రం ద్వారా మెరుగైన సేవలకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులపై సమీక్షించారు. తాగునీటి సరఫరా పనులకు సంబంధించి డీపీఆర్‌లు తయారుచేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీల్యాడ్స్, సీఎస్ఆర్ నిధుల వినియోగంతో తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థల మెరుగుతో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. పైపులైన్లు, ఓహెచ్ఎస్ఆర్‌ల తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, ఎన్‌హెచ్ఏఐ పీడీ పార్వతీశం, గ్రామీణ నీటిసరఫరా ఎస్ఈ డీవీ రమణ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరంతో ఆశా కార్యకర్త మృతి

- మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని పీహెచ్‌సీ వద్ద ధర్నా



తోట రాధ(ఫైల్‌ఫోటో)

ఎ.కొండూరు, జూలై 11 : విష జ్వరాలపై ఇంటింటి సర్వే చేస్తూ ఆదే విషజ్వరంతో ఆశా కార్యకర్త మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన ఎ.కొండూరులో జరిగింది. గ్రామానికి చెందిన తోటరాధ(42) ఆశ కార్యకర్తగా పనిచేస్తున్నది. ఇటీవల పాత కొండూరు గ్రామానికి చెందిన వెంపాటి లక్ష్మణరావు విష జర్వంతో మృతి చెందాడు. దీంతో ఆరోగ్య శాఖాధికారుల ఆదేశాల మేరకు ఆశాలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం రాధకు జర్వం రాగా టాబ్లెట్లు తీసుకొని విధులు నిర్వహించింది. జర్వ తీవ్రతతో అనారోగ్యనికి గురైన రాధను చికిత్స నిమిత్తం చిన్నఅవుటుపల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.



ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న ఆశాలు, కుటుంబసభ్యులు

విష జ్వరంతో మృతి చెందిన తోట రాధ కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు, కుటుంబసభ్యులతో ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నేత జెట్టి వెంకటేశ్వరావు మాట్లాడుతూ, జర్వంతో ఉన్నా శెలవు ఇవ్వకుండా డ్యూటీలు చేయించడం వలనే రాధ మృతి చెందినట్టు ఆరోపించారు. ఇంటింటి సర్వే చేస్తూ సత్వర వైద్యం అందక ప్లేట్‌లెట్లు తగ్గిపోగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. రాధ మృతికి ఆరోగ్య శాఖాధికారులు బాధ్యత వహించడంతో పాటు ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ రాధ కుటుంబానికి న్యాయం చేస్తామని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అసభ్య ప్రవర్తన కేసులో జైలు, జరిమానా

జి.కొండూరు, జూలై 11 : బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి న్యాయమూర్తి ఐదేళ్ల జైలు, జరిమానా విధించారు. గురువారం మచిలీపట్నంలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు కవులూరు గ్రామానికి చెందిన గుడిపూడి రాజేంద్రకు 5 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.3 వేలు జరిమాన (జరిమాన కట్టలేకపోతే మరో 3 నెలలు) శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. కవులూరు ఎంపీపీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలిక మధ్యాహ్నం స్కూల్ గేటు వద్ద నిలబడి ఉండగా అదే గ్రామానికి చెందిన గుడిపూడి రాంజేంద్ర బాలికను స్కూల్‌కు సమీపంలో ఉన్న పొదల్లోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. స్థానికులు కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు 13 ఫిబ్రవరి 2023న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం ప్రాసిక్యూషన్ తరుపున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మంజులూరు వెంకట మహేష్, ఏఎస్సై పర్యవేక్షణలో 12 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్షను ఖరారు చేశారు.

ఏపీ పాలిటెక్నిక్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఎన్నిక



భారతీనగర్, జూలై 11 : ఏపీ పాలిటెక్నిక్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ 2024-2028 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గం ఎన్నిక ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగింది. ఈ ఎన్నికల్లో ఏపీ పాలిటెక్నిక్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీఎం కమల్‌బాషా, సెక్రెటరీ కె.నాగేశ్వరరావు, ట్రెజరర్ ఎస్.పద్మావతి నియమితులైయారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ, ఏపీ పాలిటెక్నిక్ ఫిజికల్ డైరెక్టర్స్ నూతన నియామకం, ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రధానాంశాలను తీసుకొని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు.



ఆక్రమణను గుర్తిస్తూ రెవెన్యూ అధికారులు ఇచ్చిన మార్కింగ్

ఇంకా వైసీపీ మత్తులోనే..

- ఆక్రమణల తొలగింపులో అధికారుల ఉదాశీనత..
- పైనుంచి ఒత్తిడి మేరకే: తహసీల్దార్
- అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం

మోపిదేవి, జూలై 11 : ప్రభుత్వం మారినా కొంత మంది అధికారులు ఇంకా వైసీపీ మత్తు వీడటం లేదు. పంచాయతీ పరిధిలోని లే అవుట్-3లో ఆక్రమణల తొలగింపులో రెవెన్యూ అధికారుల అలసత్వం దీనికి నిదర్శనం. అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది నెలల క్రితం లే అవుట్‌లో రహదారి, డ్రెయిన్‌తో పాటు



తూతూమంత్రంగా డ్రెయిన్ పూడికతీత

స్థలాన్ని ఆక్రమించిన ఐదు గృహాలను గుర్తించి అధికారులు మార్కింగ్ చేశారు. గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ఆక్రమణలు తొలగిస్తున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం లే అవుట్‌లో ఆక్రమణలు తొలగించేందుకు ఎక్స్‌కవేటర్ వాహనాన్ని రెవెన్యూ, పంచాయతీ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అదే సమయంలో స్థానిక వైసీపీ పెద్దలు చక్రం తిప్పడంతో రెవెన్యూ, పంచాయతీ ఉద్యోగులు ఆక్రమణలు తొలగించకుండా లే అవుట్‌లో ఎస్టీ గృహాలకు ఎదురుగా ఉన్న డ్రెయిన్ పూడికతీసి మమ అనిపించేశారు. దీనిపై ఫిర్యాదుదారులు తహసీల్దార్ ఎం.శ్రీవిద్యను వివరణ కోరగా.. పై నుంచి ఒత్తిడి మేరకు ఇంత వరకే పని చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు గత వైసీపీ మత్తులోనే ఉన్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణలు తొలగించకపోవటంపై జనసేన నేత భోగిరెడ్డి సాంబయ్య అధికారులను నిలదీశారు. తొలగించని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన చేపడతామన్నారు.

టీడీపీ ఆఫీస్‌పై దాడి ఘటనలో 15మందికి రిమాండ్

- నూజివీడు సబ్ జైలుకు తరలింపు

గన్నవరం, జూలై 11 : గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో పోలీసులు 15మందిని అరెస్టు చేసి బుధవారం రాత్రి గన్నవరంలోని అదనపు సివిల్ జూనియర్ జడ్జి కోర్టుకు హాజరు పరిచారు. పోలీసులు నమోదు చేసిన పేర్లకు, వారి ఆధార్ కార్డులకు పొంతన లేకుండా ఉండటంతో న్యాయమూర్తి తప్పులను సవరించాలని కోరగా పోలీసులు తప్పులను సరిచేసి కోర్టుకు సమర్పించారు. ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులకు 14రోజులు రిమాండ్ విధించారు. వీరిని గురువారం ఉదయం నూజివీడు సబ్ జైలుకు తరలించారు.



బ్యాంకు సిబ్బందిని నిలదీస్తున్న జనసేన నేతలు

తాకట్టు పెట్టిన బంగారం మాయం!

- బ్యాంకు ఎదుట బాధితుల ఆందోళన

మచిలీపట్నం టౌన్, జూలై 11 : బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారం కనపడకపోవడంతో మచిలీపట్నంలో యునిమోని బ్యాంకు వద్ద గురువారం ఖాతాదారులతో పాటు జనసేన నాయకులు ఆందోళనకు దిగారు. మచిలీపట్నం రైతుబజారు ఎదురుగా ఉన్న యునిమోని బ్యాంకులో 500 గ్రాముల బంగారం చిన్నాపురానికి చెందిన చలమలశెట్టి పోతురాజు ఐదేళ్ల క్రితం తాకట్టు పెట్టారు. తాకట్టు విడిపించేందుకు వెళ్లిన పోతురాజుకు బంగారం కనబడటం లేదని మేనేజర్ చెప్పారు. బ్యాంకు ఉద్యోగి బంగారం దొంగిలించాడని, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని మేనేజర్ ప్రసాద్ చెప్పారు. దీంతో పోతురాజుకు మద్దతుగా జనసేన నాయకులు గల్లా తిమోతి, కొట్టె వెంకట్రావు, గడ్డం రాజు, టీడీపీ నాయకుడు పీవీ ఫణికుమార్ తదితరులు ఆందోళనకు దిగారు. బ్యాంకుకు తాళం వేసి ఘెరావ్ చేశారు.

ఇన్‌స్పెక్టర్లకు అటాచ్‌మెంట్లు

విజయవాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కమిషనరేట్‌లో ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లకు తాత్కాలిక పోస్టింగ్‌లు(అటాచ్‌మెంట్) ఇచ్చారు. ఎన్నికల కోడ్ ముందు మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. వారిలో కొంతమందిని స్పెషల్‌బ్రాంచ్‌లో నియమించారు. ఎన్నికల ప్రక్రియ ముగియడం, స్టేషన్లలో పనిభారం పెరుగుతుండటంతో స్పెషల్‌బ్రాంచ్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్లకు తాత్కాలిక పోస్టింగ్‌లు ఇచ్చారు. ఐవీ నాగేంద్రకుమార్‌ను యాంటీ నార్కొటిక్ సెల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. పలివెల శ్రీనుకు సైబర్‌క్రైం స్టేషన్‌లో అటాచ్‌మెంట్ ఇచ్చారు. రావి సురేష్‌రెడ్డికి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. డి.కాశీవిశ్వనాథ్‌ను కమిషనరేట్‌లో అడ్మిన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. కమిషనరేట్‌కు అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎండీ సహేరున్నీసాను మహిళా పీఎస్‌కు పంపారు. కె.శ్రీధర్‌కుమార్‌ను టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న పి.కృష్ణను పీసీఆర్‌లో నియమించారు. పీసీఆర్‌లో ఉన్న ఎస్‌వీవీ లక్ష్మీనారాయణకు సీసీఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. దీనికి సంబంధించి పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఉత్తర్వులు ఇచ్చారు.

త్రోబాల్ జట్ల ఎంపిక రేపు

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలో ఈ నెల 13న 10 గంటలకు సౌత్‌జోన్ సీనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర పురుషుల, మహిళా జట్ల ఎంపికలను చేపడుతున్నట్టు ఏపీ త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఈదా సులోచన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చాటిన వారిని కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఆగస్టు 2 నుంచి 4 వరకు జరిగే సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌కు ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు అర్హతా పత్రాలతో ఆ రోజు ఎంపికలకు హాజరు కావాలని సులోచన తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

రైతుకు ఆర్థిక సాయం

ఉయ్యూరు, జూలై 11: తోట్లవల్లూరు మండలం తోడేళ్ల దిబ్బకు చెందిన రైతు కస్తూరి రమేశ్‌కు చెందిన కాడెద్దు ఇటీవల ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. ఉయ్యూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో అతనికి రూ.10 వేల సాయం గురువారం అందజేశారు. కౌలుపొలం చేస్తూ ఎడ్లబండితో వ్యవసాయం చేస్తున్న రమేశ్‌కు అండగా నిలిచేందుకే ఆర్థిక సాయం అందజేశామని క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నాగసుబ్రహ్మణ్యం తెలిపారు. కేసీపీ జీఎం వీవీ పున్నారావు, డీజీఎం జి.వెంకటేశ్వర్లు, రోటరీక్లబ్ సెక్రటరీ అమీర్‌మీర్జా పాల్గొన్నారు.



రైతు కస్తూరి రమేశ్‌కు రూ.10 వేలు అందజేస్తున్న రోటరీక్లబ్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు

- ఉయ్యూరు రైతుబజారులో స్టాల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూలై 11: పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుబజార్లలో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు స్టాల్స్ ఏర్పాటుచేశారని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు రైతుబజారులో పౌరసరఫరాలశాఖ, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కిలో రూ.48, రూ.49కు బియ్యం, కిలో రూ.160కు కందిపప్పు విక్రయస్టాల్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వ నిర్వాకంతో నిత్యావసరాల ధరలు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తక్కువ ధరకే బియ్యం, కందిపప్పును రైతుబజార్లలో విక్రయించేలా స్టాల్స్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆలోచనమేరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతుబజార్లు ఏర్పాటుచేసి పండించే రైతు, కొనుగోలుచేసే వినియోగదారులకు సరసమైన ధర కల్పించారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వంలో రైతుబజార్లు, అన్ని వ్యవస్థలు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపించారు. ఆర్డీవో డి.రాజు, నగరపంచాయతీ చైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, టీడీపీ నాయకులు అన్నే శ్రీనివాసబాబు, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఉయ్యూరు రైతుబజార్‌లో సబ్సిడీపై మహిళకు కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పంచాయతీల్లో పెండింగ్ పనులపై దృష్టి పెట్టండి

- డీపీవో నాగేశ్వరనాయక్‌తో యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, జూలై 11: గన్నవరం నియోజకవర్గంలోని పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి పెట్టి సకాలంలో పూర్తయ్యేలా చూడాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి(డీపీవో) ఎస్వీ నాగేశ్వరనాయక్‌ను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. నియోజకవర్గంలోని పంచాయతీల్లో పెండింగ్ పనులపై సమీక్షా సమావేశాన్ని విజయవాడ ఫన్‌టైమ్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే నిర్వహించారు. సమావేశానికి జిల్లా పంచాయతీరాజ్ అధికారులు హాజరయ్యారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు పునరావృతం కావద్దని, పని ప్రారంభిస్తే సకాలంలో పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. గ్రామాల్లో పనులు గుర్తించి ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు. నిధుల కొరత లేకుండా తాను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రిని కలిసి మంజూరుకు కృషి చేస్తానని, సమష్టిగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడుపుదామని అన్నారు.




ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీపీవో ఎస్వీ నాగేశ్వర్‌నాయక్

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు సీఐటీయూ నేతల వినతి

హనుమాన్‌జంక్షన్: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఫలాలు అందకుండా గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన మెమో 1214ను వెంటనే రద్దు చేసి కార్మికుల సంక్షేమానికి కృషిచేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును సీఐటీయూ కృష్ణాజిల్లా నాయకులు కోరారు. గురువారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్, బాపులపాడు మండల అధ్యక్షుడు బేత శ్రీనివాసరావు తదితరులు గన్నవరంలో యార్లగడ్డను కలిసి వినతిపత్రం అందించారు. 2009 నుంచి 2019 వరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అందాయని, 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బోర్డు నిధులను దారి మళ్లించి తీవ్ర అన్యాయం చేసిందని వివరించారు. అన్యాయంగా మెమో 1214ను తీసుకొచ్చి కార్మికులకు అందాల్సిన సదుపాయాలను నిలిపివేసిందని తెలిపారు. మెమోను రద్దు చేయించి కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు. యార్లగడ్డ సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. సీఐటీయూ నాయకులు వడ్డి గిరిధర్, రాజులపాటి కొండలరావు పాల్గొన్నారు.



విత్తనాలను అందజేస్తున్న ఉద్యానవన అధికారి హరిశ్చంద్

కిచెన్‌గార్డెన్‌తో బహుళప్రయోజనాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 11: కిచెన్‌గార్డెన్(పెరటితోట) వల్ల రసాయనాలు లేని నాణ్యమైన కూరగాయలు పండించుకోవచ్చని, ఇంటి వ్యర్థాలను ఎరువుగా ఉపయోగించడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని బహుళ ప్రయోజనాలు కలుగుతాయని, డబ్బులు ఆదా అవుతాయని రైతులకు, ప్రజలకు ఉద్యానవనశాఖ అధికారి హరిశ్చంద్ సూచించారు. రేమల్లె, కొత్తపల్లి గ్రామాల్లో ఉద్యానవనశాఖ సబ్సిడీపై అందజేసే వివిధ రకాల కూరగాయవిత్తనాల(కిచెన్‌గార్డెన్) కిట్లను గురువారం ఆయన పంపిణీ చేశారు. కిచెన్‌గార్డెన్‌లో పనిచేయడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని, పర్యావరణ పరిరక్షణకు ఇది దోహదపడుతుందని తెలిపారు. కిచెన్‌గార్డెన్లను ప్రోత్సహించేందుకు సబ్సిడీపై విత్తనాలను అందిస్తున్నామన్నారు. జీవనశైలి వల్ల అనారోగ్యం పాలవకుండా కిచెన్‌గార్డెన్ పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని హరిశ్చంద్ తెలిపారు. కలపాల రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



మంత్రి సారథికి అభినందనలు తెలుపుతున్న క్రైస్తవ సంఘ నాయకులు

మంత్రి సారథికి అభినందన

ఉయ్యూరు, జూలై 11: మండల క్రైస్తవ సంఘం ఫెలోషిప్ అధ్యక్షుడు మాచవరపు రాజేశ్ ఆధ్వర్యంలో మంత్రి కొలుసు పార్థసారథిని గురువారం ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళితే సానుకూలంగా స్పందించారని రాజేశ్ తెలిపారు. ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు జాన్‌క్రాస్, సెక్రటరీ వి.రవికిరణ్, ఉపాధ్యక్షుడు బెనర్జీ, కోశాధికారి పి.రాజేశ్ తదితరులు మంత్రిని కలసిన వారిలో ఉన్నారు.



ర్యాలీలో పాల్గొన్న బాపులపాడు హైస్కూల్ విద్యార్థులు

జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ

హనుమాన్‌జంక్షన్, జూలై 11: జనాభా నియంత్రణ, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాపులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి మంజూషా అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బాపులపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో గురువారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లీబిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ చేసుకోవడంతో పాటు బిడ్డకుబిడ్డకు మధ్య దూరం ఉండేలా జాగ్రత్త వహించాలని మంజూషా సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం మల్లికార్జునరావు, పీహెచ్‌సీ సీహెచ్‌వో అప్పారావు, వైద్యసిబ్బంది నాగరాజు, మల్లిక, కోటేశ్వరి, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని
జీజీహెచ్ విద్యుత్ సిబ్బంది ధర్నా

ప్రభుత్వాసుపత్రి, జూలై 11: వేతనాలు సరిగా చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని జీజీహెచ్ విద్యుత్ సిబ్బంది గురువారం ఎలక్ట్రీషియన్ కొక్కిలిగడ్డ కన్నయ్య ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. జీజీహెచ్ ఎలక్ట్రికల్ విభాగంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని వారు తెలిపారు. అక్రమాలకు, సూపరింటెండెంట్ పెట్టే ఆగడాలకు అంతే లేకుండా పోయిందని తెలిపారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ వెసులుబాట్లు కూడా లేవన్నారు. అవకతవకలు బయటపడకుండా ఉండేందుకు జీతాలు క్యాష్ రూపంలో ఇస్తున్నారన్నారు. ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని, ఈ అంశాలపై మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవిస్తామని తెలిపారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి



ఆకునూరు సచివాలయంలో అర్జీ అందిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు బి.కీర్తి

ఉయ్యూరు, జూలై 11: ఉపాధి హామీ పథకం కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు బి.కీర్తి డిమాండ్ చేశారు. వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ గురువారం ఆకునూరు గ్రామ సచివాలయంలో ఆమె వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీలకు 8 వారాల నుంచి వేతనాలు వారి ఖాతాల్లో జమచేయకపోవడంతో ఇల్లు గడవడం కష్టంగా ఉందన్నారు. కనీసవేతనం రూ.600 చెల్లించాలని, ప్రతి కుటుంబానికి రెండు వందల పనిదినాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. వీరబత్తిన తాతబ్బాయి, రంగారావు, వెంకటసుబ్బారావు, స్టాలిన్ జోష్‌బాబు పాల్గొన్నారు.

వ్యభిచార కార్యకలాపాల
కేసులో ఇద్దరు అరెస్టు

వన్‌టౌన్, జూలై 11: సూర్యారావుపేట పోలీసుస్టేషన్ పరిధిలోని పున్నమ్మతోటలోని ఓ ఇంట్లో వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. యనమలకుదురుకు చెందిన మస్తాన్‌బీ(44) పున్నమ్మతోటలోని ఓ నివాసాన్ని అద్దెకు తీసుకుని ఇతర ప్రాంతాల నుంచి మహిళలను రప్పించి వ్యభిచార కార్యకలాపాలను నిర్వహిస్తోంది. పోలీసులకు వచ్చిన సమాచారంతో బుధవారం రాత్రి దాడి చేసి మస్తాన్‌బీని, మరో యువకుడిని అరెస్టు చేశారు. మరో యువతిని హోమ్‌కు తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, జూలై 11: ఐటీఐ కాలేజ్‌రోడ్డు, బీబీగూడెం, చిక్కవరం, గోపవరపుగూడెం, గొల్లనపల్లి, బ్రహ్మంలింగయ్య స్వామి ఆలయ ప్రాంతంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8నుంచి 12 గంటల వరకూ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఐఆర్టీలను విద్యాశాఖలో
విలీనం చేయండి

- ఎంపీ చిన్నిని కోరిన ఏపీ స్పెషల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

విద్యాధరపురం, జూలై 11: కాంట్రాక్ట్ విధానంలో దివ్యాంగులకు విద్యాబోధన చేసే ఐఆర్టీలను విద్యాశాఖలో విలీనం చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో కలిసిన ఏపీ స్పెషల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాగరాజు, ఉపాధ్యక్షుడు జె.శ్రీను, ఉపాధ్యాయులు కె.సోమరాజు, డి.నిర్మల, ఎ.శ్రీలతలు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 6,800 టీచర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఐఆర్టీలను విలీనం చేసి నోటిఫికేషన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఎంపీ స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడ తానని వారికి హామీ ఇచ్చారు.

టీడీపీ కార్యాలయాలపై దాడులకు
పాల్పడిన వారికి శిక్ష తప్పదు

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరామ్‌ప్రసాద్ గౌడ్

విద్యాధరపురం, జూలై 11: టీడీపీ కార్యాలయాలపై దాడులకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరామ్‌ప్రసాద్ గౌడ్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం శాశ్వతమనుకుని గత ఐదేళ్ల కాలంలో రెచ్చిపోయిన వైసీపీ నాయకులకు కాలం చెల్లిందన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు చంద్రబాబు ఇంటిపై జోగి రమేష్ దాడికి పాల్పడిన సంఘటనలో తాను ప్రత్యక్ష సాక్షినన్నారు. ఆనాటి సంఘటనను గుర్తు చేసుకుని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తాము దేవాలయంగా భావించే టీడీపీ కేంద్ర కార్యాలయంపై లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో వైసీపీ గూండాలు దాడి చేసి పైశాచిక ఆనందం పొందారన్నారు. ఆ దాడిని సభ్య సమాజం చీదరించుకుందన్నారు. దాడులకు ప్రేరేపించిన నాయకులు ముందస్తు బెయిల్ కోరడం అంటే నేరం అంగీకరించినట్లేనన్నారు. నేరం చేసిన వారికి శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు.



వీరపనేనిగూడెంలో వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు

రక్షిత నీటినే తాగండి

గన్నవరం, జూలై 11: రక్షిత నీటినే ప్రజలు తాగాలని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ బి.మనోహర్‌రెడ్డి సూచించారు. మండలంలోని వీరపనేనిగూడెం గ్రామంలో హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, వైద్య సిబ్బంది వాటర్ ట్యాంకులను గురువారం పరిశీలించి వాటిని శుభ్రం చేయించి, బ్లీచింగ్ కలిపించారు. వాటర్ ట్యాంకు నుంచి నీరు వెళ్లే పైప్‌లైన్లు లీకేజీ లేకుండా చూసుకోవాల న్నారు. లీకేజీ ఉన్న చోటే నీరు కలుషితం అవుతుందని వివరించారు. పైప్‌లైన్‌లపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ సురేష్, సీహెచ్‌వో శ్యామల ఏఎన్ఎం పోలిమెట్ల అనిత, ఆశావర్కర్లు రాజకుమారి, సునీత, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- బ్రైట్ కెరీర్ గ్రూప్ యజమానిపై కేసు

వన్‌టౌన్, జూలై 11: ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటనలో నాగపూర్‌కు చెందిన బ్రైట్ కెరీర్ గ్రూప్ యజమానిపై బుధ వారం రాత్రి గవర్నరుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కానూరుకు చెందిన గంగోలు శామ్యేల్‌బాబు, మరికొందరు 2023లో బ్రైట్ కెరీర్ గ్రూప్ సంస్థ హనుమాన్‌పేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఉద్యోగం కావాలంటే సంస్థకు ముందుగా రూ.30 వేలు చెల్లించాలనడంతో శామ్యేల్‌బాబు, మరో ముగ్గురు డబ్బు చెల్లించారు. తర్వాత సంస్థ నుంచి ఎటువంటి సమాచారం లేదు. ఇచ్చిన డబ్బును తిరిగి పంపలేదు. దీంతో నలుగురు బాధితులు గవర్నరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంస్థ యజమాని విజయేంద్రసింగ్‌తో పాటు ఇంటర్వ్యూలు నిర్వహించిన సిబ్బందిపై కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.55

సమస్యలపై ఎంపీ బాలశౌరికి వినతి పత్రాలు

మచిలీపట్నం టౌన్, జూలై 11 : ఎంపీ వల్లభనేని బాలశౌరికి గురువారం వివిధ ప్రాంతాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. మొవ్వ మండలంలో సాగు, తాగునీరు సరిగా సరఫరా అయ్యేలా చూడాలని కాజ గ్రామానికి చెందిన నాయకులు కోరారు. జీవిత బీమా, మెడికల్ ఇన్సూరెన్సు ప్రీమియంపై జీఎస్‌టీ రద్దు చేయాలని జీవిత బీమా ఉద్యోగుల సంఘం నాయకులు జి.కిషోర్ కుమార్, చంద్రపాల్, జె.సుధాకర్, ఎల్.రాజశేఖర్, వై.స్వామినాథన్, ఎస్వీ రత్నారావు, సుధాకర్ తదితరులు డిమాండ్ చేశారు. తుపాను వల్ల నష్టపోయిన పంటకు ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదంటూ కొందరు రైతులు వినతి పత్రం సమర్పించారు.



ప్రధానోపాధ్యాయులు, వ్యాయామోపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పోషకాహార పెరటి తోటల పెంపకంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలి

మచిలీపట్నం టౌన్, జూలై 11 : పాఠశాలల్లో పోషకాహార పెరటి తోటల పెంపకంపై అవగాహన పెంపొందించాలని కలెక్టర్ డికె బాలాజీ అన్నారు. ప్రధాపాధ్యాయులకు, వ్యాయామోపాధ్యాయులకు పోషకాహార పెరటి తోటల పెంపకంపై శిక్షణా తరగతులను గురువారం కలెక్టర్ ప్రారంభించి ప్రసంగించారు. జిల్లాలో ఎంపిక చేసిన 100 పాఠశాల ఆవరణల్లో విద్యారులు మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల్లో ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన పెంపొందించడం వల్ల క్రిమి సంహారక మందులు, రసాయన ఎరువుల వాడకం తగ్గుముఖం పడుతుందన్నారు. డీఈవో తాహెరా సుల్తానా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పద్మావతి, డీపీవో నాగేశ్వర నాయక్, డీవైఈవో శేఖర్‌సింగ్, జిల్లా సైన్సు అధికారి మహ్మద్ జాకీర్ అహమ్మద్, సన్‌స్టార్ కరస్పాండెంట్ పి.శ్రీరాం, వ్యవసాయశాఖ ఏడీ పార్థసారథి, రవికాంత్ తదితరులు మాట్లాడారు. మోపిదేవి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పాఠశాలలో ఏ విధంగా తోటలు పెంచుతున్నారో వివరించారు. స్టార్ ప్లస్ స్కూలు విద్యార్థులు అభినవ్, ప్రీతం గణితం, క్యూబ్‌పై చేసిన ప్రదర్శనను కలెక్టర్ అభినందించారు.

మధ్యాహ్న భోజన పథకంపై శ్రద్ధ వహించాలి

మచిలీపట్నం టౌన్ : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ డికె బాలాజీ సూచించారు. కలెక్టర్ బాలాజీ డీఈవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పథకం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో ఎంత మంది విద్యార్థులు భోజనం చేయటం లేదో తెలుసుకున్నారు. ఎంఈవోలతో సమావేశం ఏర్పాటు చేయాలని డీఈవో తాహెరా సుల్తానాకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీలు అజీజ్ మనోహర్ నాయక్, పర్యవేక్షకులు పవన్, సలీం, సముద్రేశ్వరరావు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలి

ఎమ్మెల్యే మండలి

కోడూరు : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై అధికారులు ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో ప్రధానంగా తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పని చేయకపోతే సహించేది లేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరానికి సాగునీరు అందించటమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. గ్రామాల్లో వెనుకబడిన వర్గాల సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. గత ప్ర భుత్వంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు వెంకట సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.









చల్లపల్లిలో బియ్యం, కందిపప్పు విక్రయాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

గుడివాడలో బియ్యం, కందిపప్పు విక్రయాలను ప్రారంభిస్తున్న ఆర్డీవో పద్మావతి

పెడన రైతు బజార్‌లో రాయితీపై నిత్యావసర సరుకుల విక్రయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పామర్రు రైతు బజార్‌లో కందిపప్పు విక్రయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ధరల కట్టడికి చర్యలు

రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయాలను ప్రారంభిస్తూ ఎమ్మెల్యే మండలి, కాగిత, వర్ల ఉద్ఘాటన

చల్లపల్లి, జూలై 11 : నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో చల్లపల్లి రైతుబజార్‌లో తగ్గింపు ధరలపై బియ్యం, కందిపప్పు విక్రయాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పౌరసరఫరాల శాఖను మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రక్షాళన చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రాయితీపై అందించే నిత్యావసర వస్తువులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం మారింది, ప్రభుత్వ విధానాలు మారాయన్న సంగతి అధికారులు గుర్తెరగాలని హితవు పలికారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, పీడీఎస్ డీటీ నరసింహారావు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరావు, డీటీ కుమార్, ఆర్‌ఐ ఘంటసాల కృష్ణమోహన్, జనసేన నేత తోట కనకదుర్గ, రైతుబజారు ఈవో బలిచక్రవర్తి, టీడీపీ, జనసేన నేతలు, అధికారులు, రైతులు, పాల్గొన్నారు. **పెడన :** నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించే చర్యల్లో భాగంగా రైతుబజార్లలో బియ్యం, కందిపప్పు చౌక ధరలకు విక్రయించే కౌంటర్లను గురువారం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తెలిపారు. రైసుమిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైతుబజారులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను కృష్ణప్రసాద్ ప్రారంభించారు. కిలో నాణ్యమైన కందిపప్పు రూ. 160, కిలో నాణ్యమైన బియ్యం రూ. 48కి, కిలో స్టీమ్‌డ్ బియ్యం రూ. 49కు విక్రయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. తహసీల్దార్ ఆర్.రాంబాబు అధ్యక్షతన జరిగిన రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ అమీర్, జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేష్, మునిసిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ ఖయూం (హన్ను), ఆర్‌ఐ మణికుమార్, వీఆర్వోలు ప్రసాదరావు, షకీరుల్లా, రైసుమిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి మామిడి ప్రసాద్, కౌన్సిలర్ మట్టా శివపావని, టీడీపీ నాయకులు శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, గుజరాల్, బెజవాడ నాగరాజు, వరుదు రామకృష్ణ, కూనపరెడ్డి రంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** రైతుబజారులో చౌక ధరల దుకాణాన్ని గురువారం ఆర్డీవో పి.పద్మావతి, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు ప్రారంభించారు. అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ లోకరాజు, రంగారావు, రైతు బజారు ఈవో శ్రీకాంత్, ఆర్‌ఐ నాగబాబు, టీడీపీ నాయకులు కామేపల్లి తులసీబాబు, వాసే మురళీ, లింగం ప్రసాద్, కడియాల గణేష్, వేమూరి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. **కూచిపూడి :** కూచిపూడి రైతు బజారులో సబ్సిడీ ధరలకు కందిపప్పు, బియ్యం విక్రయాలను మండల టీడీపీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర అధికారులతో కలిసి ప్రారంభించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరటనిచ్చే విధంగానాణ్యమైన సరుకులను తక్కువ ధరలకే అందించటం అభినందనీయమన్నారు. కూచిపూడి సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి దంపతులు, వీరంకి తులసీదాస్, వెంపటి గోపాలకృష్ణ, ఓరుగంటి నాగరాజు, తాతినేని పూర్ణచంద్రరావు, రైతు బజార్ ఈవో బలి చక్రవర్తి, తహసీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి భవాని, మండవ కోటేశ్వరరావు, ఈడే నాగేశ్వరరావు, జూపూడి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. **పామర్రు :** రాయితీపై కందిపప్పు, బియ్యం అమ్మకం దుకాణాన్ని తహసీల్దార్ శ్రీపల్లవితో కలిసి ఎమ్మెల్యే కుమార్ రాజా గురువారం ప్రారంభించారు. రైతు బజారు ఎస్టేట్ అధికారి బలిజేపల్లి శ్రీనివాసరావు, రైస్ మిల్లర్స్ సంఘంనేతలు గొగ్గవరపు శ్రీనివాసరావు, రాధాకృష్ణ, కానూరి వెంకటేశ్వరరావు, ముప్పిడి కిరణ్ టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



కూచిపూడిలో కందిపప్పు, బియ్యం స్టాల్‌ను ప్రారంభిస్తున్న రామలింగేశ్వరరావు, వీరేంద్ర

బల్లిపర్రు లాకుల వద్ద సాగునీటి విడుదల

పామర్రు : అన్నదాతల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు సాగుతున్నారని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. బల్లిపర్రులాకుల వద్ద కృష్ణాడెల్టా దిగువ ప్రాంత రైతులకు అవసరమైన సాగునీటిని సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో చంద్రబాబు నీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు అంకురార్పణ చేశారన్నారు. పోలవరం నిర్మాణం ఆలస్యం అవుతుందనే కారణంతో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి సాగునీటి కష్టాలనుతీర్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఉయ్యూరు కేసీపీ కర్మాగారం సౌజన్యంతో బల్లిపర్రు లాకుల గేట్లకు మరమ్మతులు చేయడం ముదావహ మన్నారు. లాకుల సమీపంలో మొక్కలను నాటారు. డీఈఈ భరత్, జేఈ అరుణ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, జనసేన తాడిశెట్టి నరేష్ కేదరాశిపల్లి శ్రీనివాసరావు, మిన్నురాయ్, బల్లిపర్రు సర్పంచ్ నిమ్మగడ్డసుధాకర్, సంజీవరావు, తమ్మారెడ్డి, వెన్నా శ్రీనివాసరావు, మండపాక శంకరబాబు, మండవ వెంకటకృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.



సాగునీరు వదులుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన

చల్లపల్లి : ఒకటో వార్డులోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం పరిశీలించారు. మండల పరిషత్ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన ప్రహరీని పరిశీలించారు. దాదాపు రూ.కోటిన్నర అంచనాతో మన కోసం మనం ట్రస్ట్, స్వచ్ఛ చల్లపల్లి, దాతల సహకారంతో చేపట్టనున్న పనులను స్వచ్ఛ సారథి డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్ వివరించారు. సజ్జా చలపతిరావు, కృష్ణకుమారి, బొప్పన శ్రీనివాసరావు, వేముల శేషగిరిరావు, ఉప్పాల సాంబశివరావు, తాతా ప్రదీప్, నాదెళ్ల వేణు, ఈవో పివి.మాధవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రగతిపథం

పామర్రు, జూలై 11 : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రగతిపథం ఎంతో దోహదపడుతుందని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజాతో కలిసి ప్రగతిపథం కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలశౌరి మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి సహాయం అందిస్తానని హామీఇచ్చారు. ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా మాట్లాడుతూ, ప్రజాసంక్షేమం, గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రగతి పథంలో 198 మంది అర్జీలు అందజేశారు. వీరంకి వెంకటగురుమూర్తి, కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, మంతెన రామంజనేయులు, ఈడే నాని, తాడిశెట్టి నరేష్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల వేధింపులు ఆపాలని ఆందోళన

గుడివాడ : బ్యాంకర్ల వేధింపులను నిరసిస్తూ టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సంగమ్మ, అరుణలు ఆధ్వర్యంలో మల్లాయిపాలెంలోని టిడ్కో కాలనీలో ధర్నా నిర్వహించారు. టిడ్కో లబ్ధిదారులను రుణవిముక్తులను చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈఎంఐలను చెల్లించడానికి బ్యాంకర్లు గడువు ఇవ్వాలని, కాలనీలో పాఠశాల, ఆసుపత్రి, పోలీస్ స్టేషన్, సచివాలయాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం, కల్యాణ మండపాన్ని నిర్మించాలన్నారు. కమిటీ ఉపాధ్యక్షులు మద్దెల దుర్గ, సమాయ కార్యదర్శులు షేక్ గౌస్, సయ్యద్ నూరున్నీసా, షేక్ చాన్‌భాషా, సభ్యులు అప్పలనాయుడు, రంగారావు, హేమ, కన్యాకుమారి, శివమ్మ, పార్వతి, చిన్నమ్ములు, హైమావతి, విజయ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

గుడివాడ : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ, లయన్స్ క్లబ్ ఆఫ్ సంఘమిత్ర నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆఫీసర్స్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరిరావు కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు కామేపల్లి తులసీబాబు, నూతన అధ్యక్షులు ఉప్పలపాటి సతీష్, ఝాన్సీలక్ష్మీ, కార్యదర్శి వేణుగోపాలస్వామి, కోశాధికారి పోలుకొండ సుబ్రహ్మణ్యం, సంఘమిత్ర కార్యదర్శి గుడివాడ ధనలక్ష్మీ, కోశాధికారి కాట్రగడ్డ రజిని తదితరులు పాల్గొన్నారు.

బిఎస్-6 సాంకేతిక పరిజ్ఞానంపై మెకానిక్‌లకు అవగాహన

బంటుమిల్లి : బిఎస్-6 మోటార్ సైకిల్ టెక్నాలజీపై అవగాహనకు రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణతరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర టూ వీలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దాయనేని ధర్మ పేర్కొన్నారు. గీతా మందిరంలో యూనియన్ ప్రెసిడెంట్ బాజీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. జిల్లా ప్రచార కార్యదర్శి పిఎస్ ఖాన్, జిల్లా యూనియన్ అధ్యక్షుడు ఎండి అక్బర్ బాషా, జిల్లా కార్యదర్శి ఎం. వెంకటేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌కె ఆసీఫ్‌అలీ, నాగరాజు, గంగా, బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన, గుడ్లవల్లేరు, ముదినేపల్లి మండలాల టూవీలర్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

షిరిడి సాయిబాబాకు ఎమ్మెల్యే కాగిత దంపతుల పూజలు

బంటుమిల్లి : జానకిరామాపురం గ్రామంలోని షిరిడి సాయిబాబాకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు గురువారం విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. అంగర రంగనాథ్ దంపతులు, పార్టీ నాయకులు, క్యాకర్తలు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలి



మచిలీపట్నం టౌన్ : క్రీడాకారులకు అందుబాటులో ఉండే విధంగా మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ అన్నారు. మినీ స్టేడియాన్ని గురువారం ఆయన సందర్శించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మితో స్టేడియం అభివృద్ధిపై చర్చించారు. స్టేడియాన్ని మెరక చేయించాలని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని, తాగునీరు, టాయిలెట్ వసతి కల్పించాలన్నారు. మొక్కలు పెంచాలన్నారు. టీడీపీ నాయకులు పి.వి. ఫణికుమార్, అక్కుమహంతి రాజా, జనసేన నాయకులు గడ్డం రాజు, సిరిచందన, తిరుమలశెట్టి రాజు, పోతురాజు, సాయి, గణేష్, రామజ్యోతి, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పామర్రు : దాతల సహకారాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. కంచర్లరామారావు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పాఠశాల భవన నిర్మాణ దాత దివంగత కంచర్ల రామరావు తనయులు కంచర్ల కేశవ, చక్రవర్తి అందించిన రూ.60వేలతో పాటు ఎన్నారై గుజవర్తి రామకృష్ణరెడ్డి సమకూర్చిన రూ.30 వేల ప్రోత్సాహక నగదు బహుమతులను ఎమ్మెల్యే చేతులు మీదుగా పెనుమూడి సేహ్నిత, అంజలి, రాజులపాటి హేమశ్రీ, చింతా సుజీ, షేక్ షరీఫ్, డి.ఐశ్వరలకు గురువారం అందజేశారు. వల్లూరిపల్లి చక్రవర్తి, కోటిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఇందిరా రాణి, ఎంఈవో గుమ్మడి పద్మావాణి వల్లూరిపల్లి గణేష్ పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

మచిలీపట్నం టౌన్ : మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలని డీ ఎస్పీ ఎండి అబ్దుల్ సుభాన్ అన్నారు. ఇనకుదురుపేట పోలీసు స్టేషన్‌లో గురువారం ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ర్యాలీలు ప్రశాంతంగా నిర్వహించాలని, కోనేరుసెంటర్‌లో చెస్ట్‌బీటింగ్ జరిగే సమయంలో ఎవరికీ ఏ విధమైన ఆటంకం జరగకుండా చూడాలన్నారు. ఆర్డీవో వాణి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, కమిషనర్ బాపిరాజు పాల్గొన్నారు.

వెంకట్రామ్ పరామర్శ

నాగాయలంక : టి.కొత్తపాలెం గ్రామానికి చెందిన బండ్రెడ్డి బస్వారావు (తాత) ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలుని పోగొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ గురువారం బాధితుడిని స్థానిక నేతలతో కలసి ఇంటి వద్ద పరామర్శించారు. కుటుంబానికి మండల శ్రీ కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం ద్వారా రూ.10 వేలను వెంకట్రామ్ చేతులు మీదుగా అందించారు. లక్ష్మణరావు, బాపిరెడ్డి, హరి, భోగాది సోమశేఖర్, తోట శ్రీనివాసరావు, పోలిశెట్టి మురహరి రావు, భోగాది బాలుతోపాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆయిల్ సాగుతో అధిక లాభాలు

అవనిగడ్డ రూరల్ : మోదుమూడిలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యాన శాఖ అధికారి ఎస్.రమేష్ అవగాహన కల్పించారు. ఎకరానికి 57 మొక్కను నూరు శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. అంతర్ పంటలుగా పసుపు, కంద, బొప్పాయి, కూరగాయలు పండించవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చన్నారు.

భోజనం ప్లేట్లు వితరణ

అవనిగడ్డ రూరల్ : కొత్తపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు దివంగత యలవర్తి నాగ మునీశ్వరరావు జ్ఞాపకార్థం కుమారుడు జగదీష్ కుమార్, కుటుంబ సభ్యులు 40 భోజనం ప్లేట్లు వితరణగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు నింపుకోవాలి

అవనిగడ్డ రూరల్ : దివిసీమలోని పంట కాలువలకు సాగునీరు వస్తున్నందున పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు చెరువులు, కుం టలు నింపుకోవటానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు.

రైతుకు రోటరీ క్లబ్ సాయం

తోట్లవల్లూరు : రూ.లక్ష విలువైనఎద్దు ఇటీవల బోరు వరల్లో పడి పడి మృతి చెం దటంతో రైతు కస్తూరి రమేష్‌కి ఉయ్యూరు రోటరీ క్లబ్ రూ 10 వేల ఆర్థిక సాయం అందించింది. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం, కేసీపీ జీఎం వివి పున్నారావు, డీజీఎం జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి అమీర్ మీర్జా పాల్గొన్నారు.

తెలుగుయువత నేత శివ రత్నాకర్ మృతి

ఘంటసాల : మండల తెలుగుయువత మాజీ అధ్యక్షుడు దోనేపూడి శివ రత్నాకర్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు మండల టీడీపీ తుమ్మల చౌదరి బాబు, టీడీపీ నేతలు శివరత్నాకర్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శివ రత్నాకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుంపటి చిట్టిబాబు, కాట్రగడ్డ శ్రీనివాస చక్రవర్తి, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), గాజుల శ్రీనివాసరావు, రామకృష్ణ, జీళ్ల శ్రీను, కనగాల బుజ్జి, గంటా సురేష్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మోటూరు తాగునీటి సమస్య పరిష్కరించాలి

గుడివాడ రూరల్ : మోటూరు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు ఎంపీడీవో కె.జ్యోతికి విజ్ఞప్తి చేశారు. రెండు చెరువులు ప్రజలకు సరిపడా నీటిని అందించడం లేదని, నీరు దుర్వాసన వస్తోందని తెలిపారు. ఈవోపిఆర్‌డి డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమస్య పరిష్కరిస్తానన్నారు.



తిరుమల ఆలయం ముందు బండి సంజయ్

గతంలో టీటీడీ వీరప్పన్ వారసుల చేతిలో ఉండేది

» కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

తిరుమల, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ గతంలో వీరప్పన్ వారసుల చేతిలో ఉండేదని, ఇకపై ఎర్రచందనం దొంగలను వదిలే ప్రసక్తి లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చిన తనకు చాలామంది సిబ్బంది, భక్తులు గత పాలకుల నిర్వాకం గురించి వివరించారన్నారు. అక్రమ దందాలు చేసి శ్రీవారి ఆస్తిని, జాతీయ సంపదను కొల్లగొట్టే ప్రయత్నం చేశారన్నారు. వాళ్లంతా వీరప్పన్ వారసులన్నారు. స్వామి జోలికి వెళితే ఇవాళ ఏమైందని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని సంజయ్ చెప్పారు. మొన్నటివరకు దేవుడిని నమ్మనివాళ్లు, ధర్మం గురించి ఆలోచించని వాళ్లు, పేరుకు నామాలు పెట్టుకుని స్వామికి, స్వామి ఆస్తులకు పంగనామాలు పెట్టే నయవంచకులు పోయి నిత్యం శ్రీవారి నామస్మరణతో సేవ చేసే సేవకుల రాజ్యం వచ్చిందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. గతంలో రాజకీయ నిరుద్యోగులకు టీటీడీని పునరావస కేంద్రంగా మార్చారన్నారు. అరాచక, నయవంచక పాలన పీడ విరగడైందని, గోవిందా అంటూ సేవ చేసే సేవకుల పాలన వచ్చిందని తెలిపారు.

ఆర్జీయూకేటీ చాన్సలర్ కేసీ రెడ్డి రిలీవ్

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ నాలెడ్జ్ టెక్నాలజీస్ చాన్సలర్ కేసీ రెడ్డి బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆయన చాన్సలర్‌గా నియమితులయ్యారు. ఆయన పదవీ కాలం శుక్రవారంతో ముగుస్తోంది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో బాధ్యతల నుంచి తప్పించాలని ఇటీవల ఆయన లేఖ రాశారు. దీంతో ఆయన్ను బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

యూ ట్యూబర్ ప్రణీత్‌కు 14 రోజుల రిమాండ్

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తండ్రీ, కుమార్తె బంధంపై సోషల్ మీడియాలో అసభ్య, అశ్లీల సంభాషణ చేసిన యూ ట్యూబర్ ప్రణీత్ హనుమంతుకు హైదరాబాద్ నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారులు ప్రణీత్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. బెంగళూరులో హనుమంతును అదుపులోకి తీసుకున్న పోలీసులు గురువారం నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ప్రణీత్‌కు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కాగా, ఈ కేసులో ప్రణీత్ హనుమంతుతోపాటు నాగేశ్వర్ రావు, ఆదినారాయణ, యువరాజ్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు నిందితులుగా చేర్చారు.


ఔటర్‌తోనే 'ఇన్నర్'!

» ఐఆర్ఆర్‌కు సిద్ధంగా ఉండాలని సర్కారు మౌఖిక ఆదేశాలు

» ప్రతిపాదిత అలైన్‌మెంట్, భూ అవసరాలపై సీఆర్‌డీఏ దృష్టి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

అమరావతి రాజధానికి ఔటర్ రింగ్ రోడ్డుకు కేంద్రం పచ్చజెండా ఊపడంతో ఇక ఇన్నర్ రింగ్ రోడ్డుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఐఆర్ఆర్‌కు కూడా సంసిద్ధంగా ఉండాలంటూ ప్రభుత్వం నుంచి సీఆర్‌డీఏకు మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులతో కమిషనర్ భాస్కర్ సమీక్షలు జరుపుతున్నారు. అలాగే ఇన్నర్ రింగ్ రోడ్డుకు గతంలో ప్రతిపాదించిన నివేదికను అధ్యయనం చేస్తున్నారు. ప్రతిపాదిత అలైన్‌మెంట్, భూ అవసరాలపై ఆయన దృష్టి సారించినట్టు తెలుస్తోంది. భూ సమీకరణ, భూ సేకరణ సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. వాస్తవానికి అమరావతికి సత్వరం ప్రారంభించాల్సిన ప్రాజెక్టు ఇన్నర్ రింగు రోడ్డే. భవిష్యత్తు అవసరాలకు ఓఆర్ఆర్ ఉపయోగపడుతుంది. రాజధాని నిర్మాణ పనుల సందర్భంలో సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ఐఆర్ఆర్ ఎంతో అవసరం. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఐఆర్ఆర్ ప్రాజెక్టునే కేంద్రానికి ప్రతిపాదించే అవకాశం ఉందని భావించారు. అనూహ్యంగా ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి ప్రతిపాదన చేయగా దానికి వెంటనే సుముఖత తెలిపింది. త్వరలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో ఓఆర్ఆర్‌కు నిధులు కేటాయించనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఐఆర్ఆర్‌ను కూడా కేంద్రానికి ప్రతిపాదిస్తారా లేక రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుందా అనేదానిపై స్పష్టత లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల రీత్యా ఈ ప్రాజెక్టును కూడా కేంద్రానికి ప్రతిపాదించే అవకాశాలు లేకపోలేదని సీఆర్‌డీఏ వర్గాలు పేర్కొంటున్నాయి. విజయవాడ, అమరావతి నగరాల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రతిపాదన తీసుకొచ్చారు. ఈ క్రమంలో అప్పట్లో ముసాయిదా ప్రణాళిక కూడా రూపొందించింది. ఐఆర్ఆర్‌ను 96.16 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తారు. ఎన్టీఆర్ జిల్లా కేతనకొండ వద్ద ఎన్‌హెచ్-65 నుంచి ప్రారంభమై చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16తో, పోరంకి గ్రామంలో ఎన్‌హెచ్-65తో అనుసంధానమవుతుంది. రెండోవైపున నిడమానూరు వద్ద ఎన్‌హెచ్-16 నుంచి కొండపల్లి దగ్గర ఎన్‌హెచ్-30 తో అనుసంధానిస్తారు. మొదటిదశలో 68.08 కిలోమీటర్లు, రెండోదశలో 28.08 కిలోమీటర్ల పొడవునా నిర్మించాలన్నది నాటి ప్రణాళిక. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ ఐఆర్ఆర్ 41 గ్రామాల మీదుగా సాగుతుంది. భవిష్యత్తులో బీఆర్‌టీఎస్ వంటి వ్యవస్థలను అమలు చేయటానికి వీలుగా నిర్దేశించారు. ట్రక్కులు, బస్సులు నిలిపే ప్రాంతాలు, విశ్రాంతి గదులు, ఉద్యానవనాలు, జంక్షన్లు ఏర్పాటు చేయాలని భావించారు. ఐఆర్ఆర్‌కు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమరావతి, దుగ్గిరాల, మంగళగిరి, తాడికొండ, తుళ్లూరు మండలాల పరిధిలో 2,366.35 ఎకరాలు, ఉమ్మడి కృష్ణాజిల్లాలో జీ కొండూరు, గన్నవరం, ఇబ్రహీంపట్నం, పెనమలూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో 3,521.76 ఎకరాల మేర భూములు అవసరమని నిర్ణయించారు.



ప్రతిపాదిత ఐఆర్ఆర్



విజయవాడ ఏపీఐఐసీ కాలనీ రైతుబజారులో కందిపప్పు, బియ్యం విక్రయాలను ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

284 కేంద్రాల్లో రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయాలు

» విజయవాడలో ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ, జూలై 11: బహిరంగ మార్కెట్లో బియ్యం, కందిపప్పు ధరలు భగ్గుమంటున్న తరుణంలో వాటిని సరసమైన ధరలకే వినియోగదారులకు అందించేందుకు కొత్త ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 284 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో రైతుబజార్లు, పెద్దచైన్ రిటైల్ షాపులలో గురువారం వీటిని ప్రారంభించారు. వీటిలో దేశవాళి కందిపప్పు కిలో రూ.160, స్టీమ్డ్ బీపీటీ బియ్యం కిలో రూ.49, సోనామసూరి బియ్యం కిలో రూ.48కే విక్రయిస్తున్నట్టు అధికారులు తెలిపారు. విజయవాడలోని ఏపీఐఐసీ కాలనీ రైతుబజారులో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు.

ప్రైవేటు వర్సిటీలకు ఫీజులు ఖరారు

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు యూనివర్సిటీల్లో కన్వీనర్ కోటా సీట్లకు ప్రభుత్వం ఫీజులు ఖరారు చేసింది. 2024-25 నుంచి 2026-27 విద్యా సంవత్సరం వరకు ఈ ఫీజులు అమల్లో ఉంటాయని స్పష్టంచేసింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. మొత్తం పది వర్సిటీలకు కొత్తఫీజులు ఖరారయ్యాయి. వీటిలో తొమ్మిది వర్సిటీల్లో ఇంజనీరింగ్ కోర్సులున్నాయి. మోహన్‌బాబు యూనివర్సిటీ, వీఐటీకి రూ.1.03లక్షలు, ఎస్ఆర్ఎంకు 1.02 లక్షలు, అపోలో వర్సిటీకి రూ.99500, బెస్ట్ వర్సిటీకి రూ.69,500, గోదావరి గ్లోబల్ వర్సిటీ, అన్నమాచార్య, ఆదిత్య, సెంచూరియన్ వర్సిటీలకు రూ.60వేలుగా ఇంజనీరింగ్ ఫీజును నిర్ణయించింది. అలాగే, కేఆర్ఈఏ వర్సిటీలో ఎంబీఏ కోర్సుకు రూ.97,500 ఫీజు ఖరారు చేశారు. ఈ యూనివర్సిటీల్లో ఇతర కోర్సులకు కూడా ప్రభుత్వం ఫీజులు నిర్ణయించింది. అలాగే కొత్తగా ఒక ఇంజనీరింగ్ కాలేజీ, నాలుగు కొత్త క్యాంపస్‌లకు అనుమతులు మంజూరుచేస్తూ ఉన్నత విద్యాశాఖ మరో ఉత్తర్వు జారీచేసింది. చిత్తూరులో కొత్త కాలేజీ విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అనుమతులు మంజూరు చేసింది.

డిగ్రీ కాలేజీలకు 30ఏళ్ల లీజు

అద్దె భవనాల్లో ఉన్న ప్రైవేటు డిగ్రీ కాలేజీలు 30ఏళ్ల లీజుపై కొనసాగేందుకు అవకాశం కల్పిస్తూ ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఈ గడువు 5 ఏళ్లుగా ఉంది. కాలేజీలకు ఉపశమనం కలిగిస్తూ తీసుకున్న ఈ నిర్ణయంపై మంత్రి లోకేశ్‌కు డిగ్రీ కాలేజీల సంఘం అధ్యక్షుడు గుండారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

2 మాధ్యమాలూ ఉండాలి: టీఎన్‌యూఎస్

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఆంగ్లం రెండు మాధ్యమాలూ సమాంతరంగా కొనసాగించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్) ప్రభుత్వాన్ని కోరింది. గురువారం ప్రజాదర్బార్‌లో టీఎన్‌యూఎస్ నేతలు రజనీబాబు నాయుడు, మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు, చిరుగుపాటి పినాకపాణి ఈ మేరకు మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జీవో 117ను రద్దుచేసి, విద్యా వ్యవస్థను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలల్లో రద్దుచేసిన గ్రేడ్-2 హెచ్‌ఎం, పీడీ పోస్టులను పునరుద్ధరించాలని కోరారు.

లా సిలబస్‌లో మనుస్మృతి.. విమర్శలతో వెనక్కి!

» ప్రతిపాదనను తిరస్కరించామని ఢిల్లీ వర్సిటీ వీసీ వివరణ

న్యూఢిల్లీ, జూలై 11: లా డిగ్రీ సిలబస్‌లో మనుస్మృతిని ప్రవేశపెట్టటానికి రంగం సిద్ధం చేసిన ఢిల్లీ విశ్వవిద్యాలయం (డీయూ) సర్వత్రా విమర్శలు రావడంతో వెనక్కు తగ్గింది. సవరించిన సిలబస్‌లో మనుస్మృతిని చేర్చాలనే ప్రతిపాదనను తిరస్కరించినట్లు గురువారం డీయూ వైస్ చాన్సలర్ యోగేశ్ సింగ్ పేర్కొన్నారు. వాస్తవానికి సవరించిన సిలబస్ పత్రంలో మనుస్మృతిని చేర్చాలనే ప్రతిపాదనపై డీయూ ఎకడమిక్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. కౌన్సిల్ ఆమోదిస్తే.. రానున్న విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ స్థాయి లా సిలబస్‌లో మనుస్మృతి కూడా ఒక భాగమయ్యేదే. పైగా.. విద్యార్థులు భారతీయ సంప్రదాయాలను నేర్చుకోవాలన్న నూతన విద్యావిధానం-2020 మార్గదర్శకాల ప్రకారమే సిలబస్‌లో అనుబంధ అంశంగా మనుస్మృతిని చేర్చాలని నిర్ణయించినట్లు డీయూ లా విభాగం డీన్ ప్రొఫెసర్ అంజువాలి టిక్కూ పేర్కొన్నారు. కాగా, డీయూకి చెందిన అధ్యాపక సంఘం 'సోషల్ డెమొక్రటిక్ టీచర్స్ ఫ్రంట్' దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ జనాభాలో 85 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల పట్ల, జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళల పట్ల తీవ్ర వివక్ష చూపి, వారి ప్రాథమిక హక్కులను నిరాకరించే మనుస్మృతిని సిలబస్‌లో ఎలా ప్రవేశపెడతారని ప్రశ్నిస్తూ డీయూ వీసీకి లేఖ రాసింది. ఫలితంగా ఆ 'ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లుగా' వీసీ నుంచి ప్రకటన విడుదలైంది.

నిరంకుశ ముప్పులో మన ప్రజాస్వామ్యం

» తీవ్ర ఒత్తిడిలో మీడియా

» భారత్‌లో పరిస్థితి అధ్వాన్నం

న్యూఢిల్లీ, జూలై 11: ప్రజాస్వామ్యం తీవ్ర నిరంకుశ ఒత్తిడికి గురి అవుతున్న దేశాల జాబితాలో భారత్ పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నదని అమెరికాకు చెందిన ఓ సంస్థ హెచ్చరించింది. దాదాపు వెయ్యిమంది స్కాలర్స్‌ను నమూనాగా తీసుకుని 1 నుంచి 5 వరకు సూచీల (అథారిటేరియన్ థ్రెట్ ఇండెక్స్) ఆధారంగా యాంటీ అథారిటేరియనిజం గ్రూపు' అనే సంస్థ అమెరికా సహా ఆరు దేశాలకు రేటింగ్ ఇచ్చింది. ప్రతి వారాంతంలో వీరిపై జరిపిన అధ్యయనాన్ని ఆధారంగా చేసుకుని తాజాగా సూచీలను నిర్ణయించింది. ఆరోగ్య ప్రజాస్వామ్యం కలిగిన దేశానికి రేటింగ్ వన్ ఇచ్చింది. ఈ సూచీల్లో భారత్‌కు 3.5 రేటింగ్ ఇచ్చారు. అత్యధికంగా నిరంకుశత ముప్పును భారత్ కలిగి ఉన్నదని పేర్కొంది. హక్కులు, ప్రజాస్వామ్యం విషయంలో అధ్వాన్న స్థితిలో ఉన్నదని వ్యాఖ్యానించింది. ఇక మిగతా దేశాల్లో అమెరికా 2.1, పోలాండ్ 2.3., జర్మనీ 1.5, కెనడా 1.5, ఇంగ్లాండ్ 1.8 రేటింగ్‌లో ఉన్నాయి. 2017 నుంచి తీస్తున్న సూచీల ఆధారంగా తాజాగా రేటింగ్‌ను ఇచ్చినట్టు ఈ సంస్థను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ ఒక కథనం ప్రచురించింది.

బ్రిటన్ పార్లమెంటులో భగవద్గీత సాక్షిగా ప్రమాణం

లండన్, జూలై 11: బ్రిటన్ దిగువ సభ హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికైన పలువురు భారతీయ ఎంపీలు ప్రమాణ స్వీకారం సందర్భంగా తమ ప్రత్యేకత చాటుకున్నారు. ఇటీవలి ఎన్నికల్లో మొత్తం 29 మంది భారత సంతతి వారు యూకేలో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. వీరిలో జన్మతః హిందువులైన మాజీ ప్రధాని రిషి సునాక్‌తో పాటు శివానీ రాజా, కనిష్క నారాయణ్‌లు భగవద్గీతపై ప్రమాణం చేశారు. శివానీ.. గుజరాత్ నుంచి వెళ్లి బ్రిటన్‌లో వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. గత వారం ఎన్నికల్లో ఈమె కన్జర్వేటివ్ పార్టీ నుంచి గెలిచారు. కనిష్క.. అధికార లేబర్ పార్టీ తరఫున తొలిసారిగా వేల్ ఆఫ్ గ్లామెర్గాన్ నుంచి నెగ్గారు. వేల్స్ నుంచి పార్లమెంటుకు ఎన్నికైన తొలి భారత సంతతి ఎంపీ ఈయన. సిక్కు ఎంపీలు తాన్ దేశీ, గురీందర్ సింగ్ జోసన్, హర్‌ప్రీత్ ఉప్పల్, సత్వీర్ కౌర్, వారిందర్ సింగ్ జస్‌లు తమ పవిత్ర గ్రంథం గురు గ్రంథ్ సాహిబ్ సాక్షిగా ప్రమాణం చేశారు.

బొర్రా గుహలకు ముప్పు!

వాటిపై నుంచే రెండో ట్రాక్ నిర్మాణం

» పట్టించుకోని పర్యాటక శాఖ అధికారులు



బొర్రా గుహలు

అరకులోయ, జూలై 11: సహజ సిద్ధంగా ఏర్పడిన బొర్రా గుహలకు.. కొత్తవలస-కిరండోల్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులతో ముప్పు వాటిల్లేలా ఉంది. రెండో ట్రాక్‌ను బొర్రా గుహలపై నుంచి నిర్మిస్తే గుహలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే జంబో ట్రైన్‌లు రాకపోకలు సాగించే సమయాల్లో బొర్రా గుహలలో మట్టిపెళ్లలు, రాళ్లు విరిగి పడుతున్నాయి. కేకే(కొత్తవలస-కిరండోల్) లైన్‌లో ప్రస్తుతం డబ్లింగ్ పనులు జరుగుతున్నాయి. కొరాపుట్ నుంచి సిమిలిగుడ వరకూ పనులు పూర్తవగా, సిమిలిగుడ నుంచి బొడ్డవర వరకూ పనులు జరుగుతున్నాయి. కరకవలస-బొర్రా మధ్య నాలుగు టన్నెల్స్ నిర్మించాల్సి ఉండగా రెండు పూర్తయ్యాయి. ప్రస్తుతం బొర్రా రైల్వేస్టేషన్ సమీపంలో పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఉన్న రైల్వే ట్రాక్ బొర్రా గుహలపైనే ఉంది. గత రెండేళ్ల నుంచి ఆ ట్రాక్ పైనుంచి జంబో రైళ్ల రాకపోకలు సాగించే సమయంలో గుహల్లోని మట్టిపెళ్లలు, రాళ్లు జారి పడుతున్నాయి. రెండో ట్రాక్ కూడా గుహలపై నుంచి నిర్మిస్తే వాటి ఉనికే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉంది. బొర్రా గుహలపైనుంచి రెండో ట్రాక్ నిర్మాణం చేపట్టడంపై గిరిజనులు మండిపడుతున్నారు. అలైన్‌మెంట్ మార్చాలని, రెండో ట్రాక్‌ను గుహలపై నుంచి కాకుండా వేరొక మార్గంలో నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏటా ఆరు లక్షల మంది సందర్శకులు..

ఏటా దేశవిదేశాల నుంచి 6లక్షల మందికిపైగా పర్యాటకులు బొర్రాగుహలను సందర్శిస్తున్నారు. టికెట్ల రూపంలోనే పర్యాటక శాఖకు ఐదారు కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. ట్యాక్సీలు, ఆటోలు, వ్యాన్ల వాహనదారులు, హోటళ్ల ద్వారా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. బొర్రాగుహలను జాతిసంపదగా గుర్తించి, ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాయి. ఎన్నికల ముందు కేంద్రం స్వదేశీ దర్శన్‌లో భాగంగా రూ.29కోట్లతో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరుచేసింది. స్వదేశీ దర్శన్‌ను వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించారు.

గుహలకు ఇబ్బంది ఉండదు: రైల్వేశాఖ

రెండో ట్రాక్‌ను గుహలపై నుంచి నిర్మిస్తున్న విషయాన్ని పర్యాటక శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గుహల్లో పనిచేసేవారు చెబుతున్నారు. ట్రాక్‌ను వేరే మార్గంలో నిర్మించేలా చూడాలని బొర్రా గైడ్స్ యూనియన్ కోరుతోంది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పర్యాటక మంత్రి రోజా బొర్రా గుహలను అసలు సందర్శించలేదు. ఆ శాఖ అధికారులూ పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా జోక్యం చేసుకొని ట్రాక్ అలైన్‌మెంట్ మార్చేలా చూడాలని ప్రజాప్రతినిధులు, గైడ్స్ యూనియన్ ప్రతినిధులు, బొర్రాగుహల సిబ్బంది కోరుతున్నారు. రైల్వే అధికారులను దీనిపై ప్రశ్నించగా.. ఆ లైన్ వల్ల బొర్రా గుహలకు ఎలాంటి ఇబ్బందీ ఉండబోదన్నారు. అక్కడ అలైన్‌మెంట్ మార్చేందుకు అవకాశం కూడా లేదన్నారు.

అమరావతిలో జంగిల్ క్లియరెన్స్



» 36.50 కోట్ల అంచనాతో సీఆర్‌డీఏ టెండర్లు

» 15న కాంట్రాక్టు సంస్థలతో ప్రీబిడ్ మీటింగ్

» 22 నుంచి 25 వరకు బిడ్ల స్వీకరణ

» గత ప్రభుత్వంలో విధ్వంసంతో డబుల్ ఖర్చు

విజయవాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ చర్యల కారణంగా అమరావతి రాజధాని విధ్వంసంతో భారీ నష్టం సంభవించటంతో పాటు నష్ట నివారణ కోసం ఏ పని చేయాలన్నా రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. రాజధాని వ్యాప్తంగా కమ్మేసిన పిచ్చిచెట్లు, భారీగా పెరిగిన ముళ్ల కంపలను తొలగించటానికి సీఆర్‌డీఏ రూ.36 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. అమరావతి రాజధాని పనులకు సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. సీఎం పర్యటన సందర్భంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో పిచ్చిచెట్లు, కంపలను కొంత మేర తొలగించినా.. రాజధాని వ్యాప్తంగా వీటిని తొలగించటం సీఆర్‌డీఏకు పెను సవాల్‌గా మారింది. దీంతో భారీఎత్తున యంత్ర సామగ్రిని ఉపయోగించి వీటిని తొలగించటానికి సీఆర్‌డీఏ టెండర్లు పిలవాల్సి వచ్చింది. అమరావతి రాజధానిలో జంగిల్ క్లియరెన్స్ చేయటం కోసం రూ.36.50 కోట్ల అంచనా వ్యయంతో సీఆర్‌డీఏ అధికారులు మంగళవారం టెండర్లు పిలిచారు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి బిడ్ డాక్యుమెంట్‌ను ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఈ నెల 15వ తేదీన కాంట్రాక్టర్లతో ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహిస్తారు. 22వ తేదీన క్లారిఫికేషన్స్ కోసం కాంట్రాక్టర్లతో సమావేశమౌతారు. అదేరోజు నుంచి బిడ్లను సమర్పించుకునే అవకాశం కల్పిస్తారు. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలతో బిడ్ల సమర్పణకు గడువు ముగుస్తుంది. కాంట్రాక్టు సంస్థలు కన్సార్టియంగా కానీ జాయింట్ వెంచర్‌గా కానీ ఏర్పడి టెండర్లలో పాల్గొనేలా అవకాశం కల్పించారు. అంతిమంగా అర్హతల ప్రాతిపదికన, అతి తక్కువగా కోట్ చేసిన సంస్థకు పనులు అప్పగిస్తారు. రాజధాని వ్యాప్తంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడానికి నిర్దేశిత గడువు, స్కోప్ ఆఫ్ వర్క్స్ గురించి కాంట్రాక్టు సంస్థలతో నిర్వహించే ప్రీ బిడ్ సమావేశంలో తెలియజేస్తారు. రాజధానిలో ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణాలు జరిపే చోట, ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా జోన్లు, ట్రంక్ ఇన్‌ఫ్రా ప్రాంతాల్లో దట్టంగా అడవిలా పెరిగిపోయిన చెట్లను, ముళ్ల కంపలను తొలగించనున్నారు. దాదాపుగా రాజధాని ప్రాంతం అంతా పెరిగిపోయిన కంప వనాన్ని తొలగించటానికి ఎంత లేదన్నా నెల రోజులకుపైగా సమయం పడుతుందని తెలుస్తోంది.



మళ్లీ సీఆర్‌డీఏలోకి రావాలని..!

» గత ప్రభుత్వంలో పనిచేసిన ఓ అధికారి యత్నం

» ఆయనతో రాజధాని రైతులకు క్షోభ!

విజయవాడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులతో అంటకాగుతూ రాజధాని విధ్వంసాని కి తమ వంతు తోడ్పాటు అందించిన అధికారులు మళ్లీ సీఆర్‌డీఏలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఆర్‌డీఏలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా తిరిగి రావటానికి గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారి లాబీయింగ్ చేస్తున్నారు. గతంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రాజధానికి చెందిన అన్ని వర్గాల రైతులను తీవ్ర నిర్లక్ష్యం చేశారు. వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధానిని విధ్వంసం చేసిన క్రమంలో స్థానికంగా భూములు త్యాగం చేసిన రైతులు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. రాజధాని నిర్మాణ పనులు ఎటూ లేవు. కనీసం తమ సమస్యలను పరిష్కరించాలని వచ్చే రైతులకు ఈ అధికారి చూపిన నరకం అంతా ఇంతా కాదు. గత సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ గత ప్రభుత్వం చెప్పినట్టు నడుచుకున్నారు. కమిషనర్ చెప్పిన ఆజ్ఞలను ఈ అధికారి జవదాటేవారు కాదు. రాజధాని నిర్మాణం ఎటూ లేదు. కనీసం వారి త్యాగాన్ని గుర్తించైనా రైతుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాల్సిన ఈ అధికారి పెడ చెవిన పెట్టేవారు. ఎన్నికల ముందు బదిలీపై వెళ్లిన ఈ అధికారి ప్రభుత్వం మారాక మళ్లీ సీఆర్‌డీఏకు రావటానికి చేయని ప్రయత్నం లేదు.అయితే, రైతులు వ్యతిరేకిస్తున్నారు.

కర్ణాటకలో 'ముడా' స్కాం కలకలం



» ముఖ్యమంత్రి సతీమణి ప్రమేయంపై ఆరోపణలు

» ఆమెతో పాటు మరో ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు

బెంగళూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజకీయాల్లో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) కుంభకోణం కలకలం రేపుతోంది. ఇందులో సీఎం సిద్దరామయ్య, ఆయన సతీమణి పార్వతితో పాటు మరో ఇద్దరి ప్రమేయం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. సిద్దరామయ్య, పార్వతి, ముడా అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆయన ఫిర్యాదును స్వీకరించలేదు. ఇప్పటికే ముడాలో అక్రమాల ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. పార్వతికి ఆమె సోదరుడు 1998లో ఇచ్చిన భూమికి నష్ట పరిహారం లభించిందని సీఎం చెబుతుండగా.. ఆ భూమిని మల్లికార్జున 2004లో కొనుగోలు చేసి 2010లో పార్వతికి బహుమతిగా ఇచ్చారని స్నేహమయి కృష్ణ చెబుతున్నారు. ఈ భూమి అప్పటికే డీనోటిఫై చేసినా వ్యవసాయ భూమిగా తప్పుగా చూపారని ఆరోపించారు. ఆ తర్వాత ఆ భూమిని ముడా సేకరించిందని.. అందుకు పరిహారంగా 2021లో దక్షిణ మైసూరులో అత్యంత ఖరీదైన 38,283చ.గ. స్థలాన్ని పార్వతి పొందారని తెలిపారు. అయితే ప్రభుత్వం, రెవెన్యూ అధికారుల సహాయంతో ఫోర్జరీ పత్రాలతో మల్లికార్జున ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించారని స్నేహమయి కృష్ణ ఆరోపించారు. 1998లోనే ఆ భూమి కొనుగోలు చేసినట్టుగా చూపి, 2014లో సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పార్వతి లబ్ధి పొందారని తీవ్ర విమర్శలు చేశారు. ముడాలో అక్రమాలు జరిగాయని సీఎం సతీమణి పార్వతి అనుచిత లబ్ధి పొందారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ముడా సేకరించిన భూమి కంటే పరిహారంగా చెల్లించిన భూమి అనేక రెట్లు విలువైనదని.. ఫలితంగా రాష్ట్ర ఖజానాకు రూ.4000 కోట్లు నష్టం వాటిల్లిందని కమలనాథులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని శాసనసభలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక డిమాండ్ చేశారు. మరోవైపు ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రి కుమారస్వామి స్పందిస్తూ.. సీఎం, ఉపముఖ్యమంత్రి మధ్య ఆధిపత్య పోరులో భాగంగానే ఈ కుంభకోణం తెరపైకి వచ్చిందని తెలిపారు. ఈ వివాదంపై సిద్దరామయ్య స్పందించారు. 'నా భార్యకు ముడా కేటాయించిన ఇంటి స్థలాల విషయంలో బీజేపీ రాజకీయం చేస్తోంది. శాసనసభ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తే సమాధానం చెబుతా' అన్నారు. ఒకే విషయాన్ని ఎన్నిసార్లు ప్రశ్నిస్తారని మీడియాపై మైసూరులో బుధవారం సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడా నుంచి 50:50 నిష్పత్తిలో 2019లో బీజేపీ హయాంలోనే ఇంటి స్థలాలు కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

అసెంబ్లీలో సీఎఫ్‌ఎంఎస్‌పై

కాగ్ నివేదిక

» ఆర్థిక శాఖపై శ్వేతపత్రం 18న!

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన సీఎఫ్‌ఎంఎస్‌పై కాగ్ ఇచ్చిన నివేదికను ప్రవేశపెట్టనున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎఫ్‌ఎంఎస్‌లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. అంతకుముందు టీడీపీ హయాంలో అత్యంత పకడ్బందీగా చెల్లింపుల వ్యవస్థను తీర్చిదిద్దారు. కేంద్రం, ఆర్‌బీఐ, ఇతర రాష్ట్రాలు ఈ వ్యవస్థను ప్రశంసించాయి. పలు అవార్డులూ వచ్చాయి. కానీ జగన్ సీఎం అయ్యాక సీఎఫ్‌ఎంఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. మొదట వచ్చిన బిల్లును మొదట చెల్లించాలన్న నిబంధన ఆధారంగా ఫిఫోను ఈ వ్యవస్థలో ప్రవేశపెట్టారు. కానీ వైసీపీ హయాంలో ఫిఫోను పూర్తిగా విస్మరించారు. అస్మదీయుల బిల్లులు మాత్రమే చెల్లించారు. పెండింగ్ బిల్లులు ఫిఫో ప్రకారం చెల్లింపులు జరపాలని కోరుతూ హైకోర్టులో ఏకంగా 4 లక్షల పిటిషన్లు పడ్డాయి. గత ప్రభుత్వంలో ఫిఫో ఉల్లంఘనలు సీఎఫ్‌ఎంఎస్‌లో రికార్డుకాకుండా పలు మార్పులు చేశారు. పూర్తిస్థాయిలో సీఎఫ్‌ఎంఎస్‌ను పక్కనపెట్టి మరో వ్యవస్థ హెర్బ్‌ను తీసుకొచ్చారు. హెర్బ్ విఫలమవడంతో తిరిగి సీఎఫ్‌ఎంఎస్ బాటపట్టారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే కాగ్ నివేదికలో ఈ అక్రమాలు బయటపడే అవకాశం ఉంది.

18న ఆర్థిక శ్వేతపత్రం

ఈ నెల 12న ఆర్థిక శాఖపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినా... పెండింగ్ బిల్లుల వివరాలు, ఇతర కార్పొరేషన్ల అప్పుల వివరాలపై సమాచారం రాకపోవడంతో సాధ్యంకాకపోవచ్చని ఆర్థికశాఖ భావిస్తోంది. మరోవారం సమయం ఇస్తే అంటే.. జూలై 18న పూర్తి వివరాలతో విడుదల చేసేందుకు వీలుంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేసింది.

పోలీసులు గుర్తు పట్టకుండా

ప్లాస్టిక్ సర్జరీలు

» అరెస్టుల నుంచి తప్పించుకొనేందుకు ఫిలిప్పీన్స్‌లో నేరగాళ్ల కొత్త ఎత్తులు

న్యూఢిల్లీ, జూలై 11: పోలీసులు తమను గుర్తుపట్టకుండా ఫిలిప్పీన్స్‌లో నేరగాళ్లు ప్లాస్టిక్ సర్జరీలు చేసుకుంటున్నారు. ఇలాంటి వారికోసమని ఆ దేశంలో కొన్ని రహస్య ఆస్పత్రులు కూడా వెలిశాయి. మే నెలలో అధికారులు ఓ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించిన సమయంలో ఈ విషయం వెల్లడైంది. తాజాగా, మరో రహస్య ఆస్పత్రిని గుర్తించారు. ఈ హాస్పిటళ్లలో హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ పరికరాలు, దంత నమూనాలు, శరీరం రంగును మార్చే ద్రావణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో ఒక మనిషి రూపురేఖలను పూర్తిగా మార్చవచ్చని అధికారులు తెలిపారు. ఈ రహస్య ఆస్పత్రుల క్లయింట్లంతా నిబంధనలకు విరుద్ధంగా ఫిలిప్పీన్స్‌లో ఉంటున్నవారు, క్యాసినో ఆడేవారు, గ్యాంబ్లర్లు, కరడుగట్టిన నేరస్థులేనని వివరించారు. ఈ వ్యవహారంలో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు వియత్నాం, ఒకరు చైనాకు చెందినవారు. ఈ రెండు ఆస్పత్రులను శాశ్వతంగా మూసివేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.